ప్రజాశక్తి

బుధవారం 17 ఏప్రిల్ 2024 పేజీలు 8

విజయనగరం పార్వతీపురం మన్యం

గడిచిన పదేళ్లలో విద్యుత్ ఛార్జీల పెంపు విషయంలో వైసిపి, టిడిపి దొందూ దొందే అన్నట్టుగా వ్యవహరించాయి. కేంద్రంలోని బిజెపి రూపొందించిన విద్యుత్ సంస్కరణలను పక్కాగా అమలు చేశాయి. దీంతో, గడిచిన పదేళ్లలో వినియోగపు బిల్లులతోపాటు ఫిక్స్‌డ్ ఛార్జీ, కస్టమర్ ఛార్జీ, ట్రూ అప్ ఛార్జీ తదితరాల రూపాల్లో ప్రజలపై రూ.కోట్ల భారం పడింది. సగటు వినియోగదారులు విద్యుత్ భారాలను భరించలేక విలవిల లాడుతున్నారు. కేవలం గృహ వినియోగదారులే కాకుండా చిన్నవ్యాపారులు, రైతులు, ఫెర్రో పరిశ్రమల యాజమాన్యాలు కూడా ఆర్థికంగా కుదేలవుతున్నారు. జిల్లాపై గత ఏడాది నుంచి ఏటా సుమారు రూ.24కోట్ల మేర భారం పడుతోంది. అంతకు ముందు చంద్రబాబు హయాంలోనూ ఛార్జీల భారం భారీగానే పడింది.

విద్యుత్తుఛార్జీల పెంపులో దొందూ దొందే

సర్దుబాటు పేరిట బాదుడు

బిజెపి డైరెక్షన్... వైసిపి, టిడిపిల యాక్షన్

జగన్ పాలనలో ఏడాదికి రూ.24 కోట్ల భారం

బాబు హయాంలోనూ అదేతీరు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం ఉమ్మడి జిల్లాలో 8,11,017 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో గృహాలకు 6,71,921, వాణిజ్యం 68,939, ప్రభుత్వ కార్యాలయాలకు 15,321, వ్యవసాయ పంపుసెట్‌లకు, 52,082 ఉన్నాయి. వీటన్నింటికీ ఎపిఇపిడిసిఎల్ ద్వారా విద్యుత్ సరఫరా అవుతోంది. వినియోగదారులంతా ఎప్పటికప్పుడే బిల్లులు చెల్లిస్తున్నారు. ఒక వేళ గడువు తేదీలోపు చెల్లించకపోతే ఫీజులు పీకేసి మరీ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. అయినప్పటికీ వినియోగదారులు చెల్లించిన డబ్బులు విద్యుత్తు ఉత్పత్తికి, పంపిణీ తదితర ఖర్చులకు సరిపోలేదంటూ వసూలు చేస్తున్నారు. సర్దుబాటు ఛార్జీ అంటే ఇదే. మరే సంస్థలోనూ లేని విధంగా విద్యుత్ పంపిణీ సంస్థల్లోనే ఇటువంటి విధానం ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తోంది. ఇందులో భాగంగానే 2014 నుంచి 19 వరకు అంటే టిడిపి పాలనలో వినియోగించుకున్న విద్యుత్‌కు చెల్లించిన బిల్లులు సరిపోలేదంటూ వైసిపి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రూ.2,900 కోట్లమేర సర్దుబాటు భారం మోపింది. ఈమేరకు జనం నుంచి మూడేళ్లపాటు వసూలు చేయడానికి విద్యుత్ ఛార్జీల నియంత్రణ మండలి ద్వారా విద్యుత్ పంపిణీ సంస్థలు ఆమోదం పొందాయి. అంతకు ముందు టిడిపి హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.890కోట్ల మేర సర్దుబాటు ఛార్జీలు వసూలు చేశారు. ఈ మేరకు అటు టిడిపి, ఇటు వైసిపి పాలనలో మన జిల్లా ప్రజలు, పరిశ్రమల యజమానులపై వందల రూ.కోట్లు భారం పడింది. ఈ సంగతి కాస్త అటుంచితే....

2022 ఆర్థిక సంవత్సరం నుంచి యూనిట్‌కు 20పైసలు చొప్పున వినియోగదారులు అదనంగా చెల్లిస్తున్నారు. ఇది చాలదన్నట్టుగా 2021 -22 (మిగతా..3లో)

ఓంకార్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

మెకానిక్ కొడుకు ఐఎఎస్

సివిల్స్ ఫలితాల్లో ఓంకార్‌కు 202 , పృథ్వీరాజ్‌కు 493వ ర్యాంకులు

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

యుపిఎస్‌సి విడుదల చేసిన సివిల్స్ ఫలితాల్లో పార్వతీపురం పట్టణం కొత్తవలసకు చెందిన మోటార్ బైక్ మెకానిక్ కుమారుడు బండి ఓంకార్ 202వ ర్యాంకు సాధించాడు. ఈయన తండ్రి బండి వీర్రాజు (స్వామి) పార్వతీపురంలో ప్రస్తుతం మెకానిక్‌గా పనిచేస్తూ ఆటో మొబైల్ షాపు నిర్వర్తిస్తున్నాడు. పేద కుటుంబానికి చెందిన ఓంకార్ ర్యాంకు సాధించడం పట్ల పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కురుపాం యువకుడికి 493వ ర్యాంకు

కురుపాం : మంగళవారం విడుదలైన సివిల్స్ ఫలితాల్లో కురుపాం గ్రామానికి చెందిన దొనక పృథ్వీరాజ్ 493వ ర్యాంకు ర్యాంకు సాధించారు. ఈయన తండ్రి దొనక విజయ్ కుమార్ తల్లి రత్నం ప్రస్తుతం పార్వతీపురంలో నివాసం ఉంటున్నారు. తండ్రి ఎంఆర్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా, తల్లి జిల్లా పరిషత్‌లో రికార్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. అక్క పూజిత ఆంధ్ర మెడికల్ కాలేజీలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పృథ్వీరాజ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పీజీ చదివి ఇంటి వద్దే ఉంటూ సివిల్స్ కు సన్నద్ధమై రెండో ప్రయత్నంలోనే ర్యాంకు సాధించారు. ఆయన ర్యాంకు సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, సన్నిహితులు ,గ్రామస్తులు పలువురు అభినందనలు తెలిపారు.

జోరుగా సాగుతున్న క్వారీ తవ్వకాలు

మైనింగ్‌కు అనుమతులేవి?

కాసులకు కక్కుర్తి పడి చర్యలు తీసుకోని అధికారులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వీలుపర్తి పంచాయతీ పరిధిలో గల సర్వే నెంబరు 4,5లలో ఏ విధమైన అనుమతులూ లేకుండా అక్రమ మైనింగ్ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఆ గ్రామానికి చెందిన నాయకుడు ఇష్టానుసారంగా తవ్వకాలు చేసి కాసులును పోగేసుకుంటూ ప్రభుత్వానికి రావలసిన ఆదాయానికి గండి కొడుతున్నారు. భారీ పేలుళ్ల కారణంగా పరిసర ప్రాంతాలలో ఉన్న బొర్రావలస, కొలుకు పాలెం గ్రామాల్లో గిరిజనుల ఇళ్లు బీటలు వారి పోతున్నాయి. పేలుళ్ల వల్ల వచ్చే దూళి కారణంగా రోగాలు బారిన పడుతున్నారు. భయంకరమైన శబ్ధాలతో పేలుళ్లకు శబ్ధ కాలుష్యానికి గురువుతున్నారు. ఈ దూలి వల్ల పంటలు కూడా పాడైపోతున్నాయి. మరో పక్క ప్రజలు రోగాల భారిన పడుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు ఫిర్యాదులు చేస్తే ఆమె ఆదేశాలు మేరకు క్షేత్ర స్థాయిలోకి వచ్చిన అధికారులు తూతూ మంత్రంగా దర్యాప్తు చేసి (మిగతా..3లో)

24గంటల్లోనే ఖర్చులు నమోదు 3 లో

తొలి ముఖ్యమంత్రిని అందించిన ఎస్.కోట 5 లో

సీతంపేట, బొబ్బిలిలో వర్షం 8 లో



బలిజిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపి అభ్యర్థి అప్పలనర్స, సిపిఎం నాయకులు, కార్యకర్తలు

గిరిజన హక్కులను కాలరాస్తున్న బిజెపి

- బిజెపితోపాటు దాని పొత్తులు తొత్తు పార్టీలను ఓడించండి
- సిపిఎం అభ్యర్థులను గెలిపించండి : అరకు ఎంపి అభ్యర్థి అప్పలనర్స

ప్రజాశక్తి-సాలూరు, బలిజిపేట

కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం గిరిజన హక్కులను కాలరాస్తుంటే రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు దానికి మద్దతు నిలుస్తున్నాయని సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స అన్నారు. మంగళవారం సాలూరు, బలిజిపేటలో ప్రచారం నిర్వహించారు. సాలూరులో స్టేట్‌బ్యాంకు నుంచి గాంధీనగర్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సాలూరు రాజేశ్వరరావు పార్కులో గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సీదరపు అప్పారావు అధ్యక్షతన సభ జరిగింది. బలిజిపేట మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థి అప్పలనర్స మాట్లాడుతూ (మిగతా..3లో)

డిప్యూటీ డిఇఒగా డెంకాడ ఎంఇఒ

ప్రజాశక్తి- డెంకాడ

విజయనగరం డివిజన్ డిప్యూటీ డిఇఒగా ఎఫ్ఎసి డెంకాడ ఎంఇఒ- 1 కె. వెంకటరమణను నియమిస్తూ ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయనకు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కొనసాగుతన్న వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 69 మంది వాలంటీర్లు రాజీనామా చేశారని ఎంపిడిఒ బి మధుసూదన్ రావు తెలిపారు. తెర్లాం, కునాయవలస, కుసుమూరు, సుందరాడ, చీకటి పేట, నెమలాం సచివాలయాల పరిధిలో పనిచేసిన వీరంతా స్వచ్ఛందంగా రాజీనామా చేశారని చెప్పారు. వీటిని ఆమోందించి కలెక్టర్‌కు పంపించామని ఆయన స్పష్టం చేశారు.

చీపురుపల్లి: మండలంలోని గొల్లలములగాం, గొల్లలపాలేం గ్రామానికి చెందిన గ్రామ, వార్డు వాలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. ఈ మేరకు వారి రాజీనామా పత్రాలను స్థానిక ఎంపిడిఒ డి శ్వేతకి అందజేశారు.

బొబ్బిలిరూరల్: మండలంలోని పని చేస్తున్న 59 మంది వాలంటీర్లు రాజీనామాలు చేశారని ఎంపిడిఒ రవి కుమార్ మంగళవారం తెలిపారు.

డెంకాడ: మండలంలోని గొలగాం సచివాలయం పరిధిలోని బంగార్రాజుపేట, గొలగాం, గంట్లాం గ్రామాలకు చెందిన 13 మంది వాలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను గొలగాం సచివాలయం వద్ద పంచాయతీ సెక్రటరీకు సమర్పించారు.

రామభద్రపురం: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 89 మంది వాలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపిడిఒ ఈశ్వరమ్మకు అందించినట్లు ఆమె తెలిపారు.

వసతి గృహ విద్యార్థికి అభినందన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక బిసి బాలికల కళాశాల వసతి గృహం విద్యార్థిని బర్ల లలితను సంక్షేమాధికారి మంగళవారం అభినందించారు. లలిత ప్రథమ ఇంటర్ పరీక్షల ఫలితాల్లో బైపిసిలో 435 మార్కులతో రాష్ట్ర స్థాయి రెండవ ర్యాంకు సాధించినందుకు వసతి గృహం సంక్షేమాధికారి జి. కృష్ణవేణి ఆమెను అభినందించారు. కాగా విద్యార్థి లలిత స్థానిక సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతుంది.

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి- చీపురుపల్లి

గరివిడికి చెందిన సహాయ్ సంస్థ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. గరివిడి పట్టణానికి చెందిన ఉప్పు శ్రీను సతీమణి పార్వతి ద్వితీయ వర్ధంతిని పురష్కరించుకొని చీపురుపల్లిలో గల సినిమా థియేటర్లు, ఫంక్షన్ హాల్స్‌లలో పని చేస్తున్న సుమారు 50 మంది పేద కార్మికులకు మంగళవారం దుస్తులను సహాయ్ సంస్థ పంపిణీ చేసింది. ఈ కార్యక్రమంలో డి మాధవవర్మ పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక ఇవిఎం గోదాం వద్ద ఇవిఎం స్ట్రాంగ్ రూమ్‌లను రాజకీయ పక్షాలు మంగళవారం నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి ఎం. నూకరాజు ఆధ్వర్యంలో పరిశీలించారు. తహశీల్దారు డి. ధర్మ రాజు పర్యవేక్షణలో వివిధ పార్టీలకు చెందిన నాయకుల సమక్షంలో పరిశీలించి రూములకు షీలు వేశారు. ఈ తనిఖీలో వైసిపి నుంచి రేగాన శ్రీనివాసరావు, టిడిపి తరపున శ్రీహరి, కాంగ్రెస్ తరపున సరగడ రమేష్ కుమార్, జై భీంరావు భారత్ పార్టీ తరపున తొంపల నరసయ్య, సిపిఐ తాలాడ సన్నిబాబు, జనసేన నాయకులు కూడా పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని మీసాలపేట, కొంపంగి గ్రామాల్లో ఉపాధి పనులను ఎంపిడిఒ సిహెచ్ లక్ష్మీబాయి మంగళవారం పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆమె వేతనదారులతో ముచ్చటించారు. వేసవి తాకిడికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఒఆర్ఎస్, ఎక్కువ మంచి నీళ్ళు తీసుకోవాలని ఆమె వేతనదారులకు సూచించారు. పని ప్రదేశంలో నీడకోసం టెంట్లు వేసుకోవాలన్నారు. ఎండ దెబ్బ గురికాకుండా ఉదయం ఆరుగంటలకు పనులు చేపట్టి పదిగంటలలోపు పనులను ముగించుకొని వెళ్లాలని కూలీలకు అవగాహన కల్పించారు. ఇద్దనవలస పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ఇష్టాగోష్టి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మీసాలపేట ఫీల్డ్ అసిస్టెంట్ సూరిబాబు, సచివాలయం సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి సుస్తీ

గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు వైద్య సేవలందించేందుకు గ్రామాల్లో నిర్మాణం తలపెట్టిన హెల్త్ క్లినిక్‌లు నాలుగేళ్లవుతున్నా పూర్తి కాలేదు. దీంతో ఈ ఆరోగ్య ఉప కేంద్రాలు అరకొర వసతులతో అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. ఈ అద్దె కూడా ప్రభుత్వం చెల్లించక పోవడంతో వైద్య సిబ్బంది సొంత నిధులతో అద్దె చెల్లిస్తున్నారు. ఈ అద్దె భవనాలు కూడా ఇరుగ్గా ఉండటంతో వైద్య సిబ్బంది, రోగులు అవస్థలు పడుతున్నారు. వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు పేరుతో పక్కా భవనాలు పూర్తి కాకపోవడంతో అద్దె కొంపల్లో ఇరుకు గదుల్లో వైద్యం అందించాల్సి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు. పైగా ఆరోగ్య కేంద్రాల అద్దెకు ప్రభుత్వం కేవలం రూ. 250 చెల్లించడంతో మిగతా సొమ్మును తామే భరిస్తున్నామని వైద్య సిబ్బంది చెబుతున్నారు. ఈ అద్దె కూడా సకాలంలో చెల్లింకపోవడంతో భారంగా మారిందని ఆరోగ్య సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అద్దె తక్కువ కావడంతో పూర్తి సదుపాయాలతో కూడిన భవనాలు దొరకని దుస్థితి నెలకొందని, ఇరుగ్గా ఉండే చిన్న గదుల్లోనే వైద్య సేవలు నిర్వహించడంతో పూర్తిస్థాయి వైద్య సేవలు అందడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

- **పక్కా భవనాలకు నోచుకోని ఆరోగ్య ఉప కేంద్రాలు**
- **వైద్య సిబ్బంది సొంత నిధులతో అద్దె భవనాల్లోనే నిర్వహణ**
- **అరకొర వసతులతో అందని వైద్య సేవలు**

లక్ష్మిపురంలో మధ్యలో నిలిచిపోయిన నిర్మాణం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని 39 గ్రామపంచాయతీలలో 25 సచివాలయాల పరిధిలో 22 వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు మంజూరయ్యాయి. ఒక్కొక్క హెల్త్ క్లినిక్‌కు ఉపాధి హామీ పథకం నిధులు రూ.17.50 లక్షలు వెచ్చించారు. ఉపాధి పథకం అనగానే కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ఈ హెల్త్‌క్లినిక్‌ల నిర్మాణాలు ముందుకు సాగడం లేదని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. అంబకండి 1, వెంకంపేట పూర్తికాగా, అంబకండి 2 బిల్లులు చాలక మధ్యలోనే నిర్మాణాలు ఆపేశారు. కొన్ని చోట్ల పునాది స్థాయిలోను, ఇంకొన్ని స్థలాలు లేక, మరికొన్ని కట్టడాలు పూర్తికాక అసంపూర్తిగానే ఉండిపోయాయి. నిధులు చాలక కొన్ని, బిల్లులు చెల్లించక మరికొన్ని ఇలా ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది.

22 ఆరోగ్య ఉప కేంద్రాలకు 2 పూర్తి

రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 10 హెల్త్ క్లినిక్‌లు, బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 12 హెల్త్ క్లినిక్‌లు నిర్మాణాలు చేపట్టవలసి ఉంది. అంబకండి 1లో పూర్తి చేసిన ఉపకేంద్రాన్ని ఇటీవల ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు ప్రారంభించారు. వెంకంపేటలో కూడా నిర్మాణం పూర్తయింది. మొత్తం 22 భవనాలకు గాను ఇప్పటి వరకూ 2 భవనాలే పూర్తయ్యాయి. మిగతా చోట్ల నిధులు చాలక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా హెల్త్ క్లినిక్‌లు తయారయ్యాయి.

అద్దె కొంపల్లోనే 12 ఉప కేంద్రాలు నిర్వహణ

రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 6 ఆరోగ్య ఉప కేంద్రాలు, బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మరో 6 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. ఈ ఉపకేంద్రాలకు పక్కా భవనాలు లేక అద్దె భవనాల్లోనే కొనసాగుతూ వైద్య సేవలు ఇరుగు గదిలోనే నిర్వహిస్తున్నారు. ఈ అద్దె భవనాల్లో ఉన్న ఉపకేంద్రాలకు అరకొర అద్దెలు ప్రభుత్వాలు ఇస్తూ, సరైన సదుపాయాలు లేక కొన్నిచోట్ల పూరి పాకాల్లోనూ, మరికొన్ని చోట్ల పెంకుటింటలోనూ, ఇంకొన్నిచోట్ల డాబాలలోను ఉపకేంద్రాలను నడుస్తున్నాయి. ఇరుకు గదుల్లోనే సిబ్బంది విధులు నిర్వహించటంతో రోగులకు సరైన సదుపాయాలు లేని దుస్థితి కనిపిస్తుందని విమర్శలు వినిపిస్తున్నాయి. పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందకపోవటంతో ఇటు సిబ్బంది, అటు రోగులు నానా అవస్థలు పడుతున్నారు.

అద్దె చెల్లిస్తున్న ఎఎన్ఎంలు

ప్రస్తుతం హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు చేపట్టడంతో ఉన్న ఉపకేంద్రాలకు ప్రభుత్వం అద్దె చెల్లించక ఉప కేంద్రాల పరిధి ఏఎన్ఎంలే సర్దుబాటు చేస్తూ ఉప కేంద్రాలు నడిపిస్తున్నారు. వారికి వచ్చిన జీతం డబ్బులో కొంత అద్దెకు చెల్లించి కేంద్రాలను నడిపిస్తున్నారు. ప్రభుత్వాలు అద్దె చెల్లించకపోవడంతో ఎలా నడిపిస్తు న్నారని ప్రశ్నిస్తే చెప్పేందుకు వైద్య సిబ్బంది నిరాకరిస్తున్నారు. మూడేళు గడిచిన హెల్త్ క్లినిక్‌లు ఇంతవరకు పూర్తి కాకపోవటంతో ఉప కేంద్రాలు అద్దె లేకుండా ఎలా నడిపేదని వైద్య సిబ్బంది వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు దృష్టి సారించి హెల్త్ క్లినిక్‌లు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు

వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు నిర్మాణాలకు నిధులు చాలడం లేదని కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. మండలానికి 22 వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు మంజూరయ్యాయి. ఒక్కొక్క హెల్త్ క్లినిక్ నిర్మాణానికి ఉపాధి నిధులు రూ.17.50 లక్షలు కేటాయించాం. ప్రస్తుత రేట్లు ప్రకారం నిధులు చాలక కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. అంబకండి.1, వెంకంపేట హెల్త్ క్లినిక్‌లు మాత్రమే పూర్తయ్యాయి. అంబకండి 2 నిధులు చాలక ఆపేశారు. స్థానిక నాయకులను ఒప్పించి నిర్మాణాలకు చర్యలు తీసుకున్నాం. నిధులు చాలని విషయాన్ని ఉన్నత అధికారులకు తెలియజేశాం. అదనంగా మంజూరు అయితే నిర్మాణాలు వేగవంతం అవుతాయి.

- శ్యామల కుమారి ఎంపిడిఒ రేగిడి

వివక్ష సహించ లేక పార్టీ మారాం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వైసిపిలో వివక్ష సహించలేక పార్టీ మారాల్సి వచ్చిందని నగర పంచాయతీ చైర్ పర్సన్ బంగారు సరోజిని, 16వ వార్డు కౌన్సిలర్ పాండ్రంకి సత్యవతి తెలిపారు. మంగళవారం చైర్ పర్సన్ స్వగృహంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా అధికార వైసిపిలో వివక్షకు గురై పార్టీ మారాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ముఖ్యంగా తాను పేరుకే నగర పంచాయతీ చైర్ పర్సన్‌ను తప్ప ఎటువంటి గౌరవం అధికార పార్టీ నుంచి లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన తనను ప్రోటో కాల్ పాటించే వారు కాదని, ఏ కార్యక్రమమైనా తానే అడిగి తెలుసుకోవడం తప్ప సమాచారం ఉండేది కాదని అన్నారు. తన పట్ల అధికార పార్టీ నాయకులు అనుసరిస్తున్న తీరును వైసిపి అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్ళినా సరే చూద్దాంలే అని కాలయాపన చేశారే తప్ప న్యాయం చేయలేదని తెలిపారు. మూడు సంవత్సరాలుగా నాయకులు తమ తీరు మార్చుకొని వివక్ష లేకుండా చూస్తారని ఎదురు చూసినా పట్టించుకోలేదని ఈ నేపథ్యంలో వివక్ష చూపిన పార్టీలో ఉండకూడదని నిర్ణయం తీసుకుని జనసేనలో చేరామన్నారు. కౌన్సిలర్ సత్యవతి మాట్లాడుతూ తనను ఎన్నుకున్న 16వ వార్డులో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు కనీసం తాగు నీటికి కూడా వార్డు నోచుకోలేదని, అభివృద్ధి పనులు కూడా అంతంత మాత్రంగానే జరిగాయని అన్నారు. సమస్యలపై నాయకులను ప్రశ్నిస్తే కౌన్సిలర్‌గా కూడా గుర్తించి సమాధానం చేప్పేవారు కాదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ మారినందున కొంత మంది నాయకులు పదవులకు రాజీనామా చేయాలని చెబుతున్నారని రాజీ నామా చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాయకులు బంగారు శంకర రావు, పాండ్రంకి సత్య నారాయణ, బంగారు భాను ప్రకాష్, బంగారు లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నగరపంచాయతీ చైర్‌పర్సన్ సరోజిని, కౌన్సిలర్ సత్యవతి

వైసిపి స్వార్థానికి వాలంటీర్లు బలి

ప్రజాశక్తి- బొబ్బిలి

వైసిపి స్వార్థ రాజకీయాలకు వాలంటీర్లను బలి తీసుకుంటున్నారని జనసేన పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి బాబు పాలూరు అన్నారు. ఆయన మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. వైసిపి నాయకులకు అంత చిత్తశుద్ధి ఉంటే ముందు వైసిపి కౌన్సిలర్లు, వివిధ అధికార హోదాల్లో ఉన్న వైసిపి ప్రతినిధులు రాజీనామా చేసాక వాలంటీర్ల జోలికి వెళ్లాలన్నారు. వాలంటీర్లకు ఇష్టం లేకపోయినా, వైసిపి కూలీలుగా వాడుకోవడానికి చూస్తున్నారన్నారు. వైసిపి ఎలాగో ఓడిపోతుందని, తమతో పాటు వాలంటీర్ల భవిష్యత్తును కూడా నాశనం చెయ్యాలని చూస్తున్నారని విమర్శించారు.

వాలంటీర్లు రాజకీయాలకు దూరంగా ఉంటే అండగా ఉంటాం: బేబినాయన

గ్రామ, వార్డు వాలంటీర్లు రాజకీయాలకు దూరంగా ఉంటే టిడిపి వారికి అండగా ఉంటుందని కూటమి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన అన్నారు. కోటలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణ, గ్రామాల్లో పని చేస్తున్న వాలంటీర్లతో వైసిపి నాయకులు బలవంతంగా రాజీనామా చేపిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని, 130 స్థానాలకు పైగా కూటమి విజయం సాధించి అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. వైసిపి అధికార దాహంతో వాలంటీర్ల జీవితాలను బలి పశువులను చేస్తుందన్నారని విమర్శించారు. కూటమి అధికారంలోకి వస్తే వాలంటీర్లకు గౌరవ ప్రదమైన స్థానం ఇస్తుందన్నారు. రాజీనామా చేసి రాజకీయాల్లో పాల్గొనే వారికి ప్రాధాన్యత ఇవ్వమని, రాజకీయాలకు దూరంగా ఉంటే అధికారంలోకి వచ్చిన తర్వాత మరల తీసుకుంటామని చెప్పారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - రామభద్రపురం

స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సదాసీదాగా ముగిసింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రశ్నోత్త రాలు, చర్చలు లేకుండానే సభ ప్రారంభమై వెంటనే ముగిసింది. రాజ్యాంగ నిబంధనల మేరకు 90 రోజుల్లోగా సర్వసభ్య సమావేశం జరగాలి కాబట్టి సమావేశం పెట్టినా కోడ్ నేపథ్యంలో ముగించామని ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. ఎంపిడిఒ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సభ్యుల సంతకాలు తీసుకొని ముగించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సరస్వతి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

24 గంట్లలోనే ఖర్చు వివరాలు నమోదు

జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఈ నెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నందున అభ్యర్థుల ఖాతాలో ఖర్చు లెక్కించేందుకు సిద్ధం కావాలని జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. వ్యయ నోడల్ అధికారులు ఆడిట్ అధికారులు, నియోజకవర్గాల అకౌంటింగ్ బృందాలతో కలెక్టరేట్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అభ్యర్థి నామినేషన్ వేసిన దగ్గరనుంచీ అతని ఖాతాలో ఖర్చు నమోదు చేయాలని ఆదేశించారు. సభలు, సమావేశాలు, ఎన్నికల ప్రచార కార్యక్రమాలు, జెండాలు, బ్యానర్లు, పోస్టర్లు, వినియోగిస్తున్న వాహనాలు, ఏజెంట్లకు పెట్టే భోజనాల ఖర్చు సైతం అభ్యర్థి ఖాతా కిందకే వస్తుందన్నారు. పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులు ఇద్దరూ ఉమ్మడిగా సమావేశాలు, సభలు నిర్వహిస్తే, ఆ ఖర్చును ఇద్దరికీ సర్దుబాటు చేయాలని సూచించారు. జిల్లాకు ముగ్గురు ఐఆర్ఎస్ అధికారులను వ్యయ పరిశీలకులుగా ఎన్నికల కమిషన్ నియమించిందని, ఒకరు పార్లమెంటుకు, మిగిలిన ఇద్దరూ అసెంబ్లీ నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకులుగా వ్యవహరిస్తారని చెప్పారు. త్వరలో వారు జిల్లాకు రానున్నారని చెప్పారు. వారు వచ్చేలోగా అవసరమైన అన్ని రిజిష్టర్లను సిద్ధం చేసి, ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. సభలు, సమావేశాలు జరిగిన 24 గంట్లలోగానే అభ్యర్థి ఖాతాలో ఖర్చు నమోదు చేయాలని, ఆలస్యం చేయకూడదని ఆదేశించారు. నామినేషన్ వేసిన దగ్గరనుంచి ఓట్ల లెక్కింపు పూర్తయ్యే రోజు వరకూ అభ్యర్థి చేసే ఖర్చు అతని ఖాతాలోకి వస్తుందని స్పష్టం చేశారు. సభలు, సమావేశాలకు అనుమతినిచ్చే విభాగం, ఎంసిఎంసి, ఎంసిసి, ఫ్లయింగ్ స్క్వాడ్స్, వీడియో సర్వైలెన్స్ టీమ్స్, సంబంధిత బృందాలతో సమన్వయం చేసుకొని, ఖర్చులు నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డిఆర్ఒ ఎస్‌డి అనిత, జిల్లా ఆడిట్ అధికారి అరుణకుమారి, జిల్లా వ్యయ నోడల్ అధికారి డాక్టర్ సత్యప్రసాద్, నియోజకవర్గాల ఎఇఒలు పాల్గొన్నారు.

కోలగట్ల ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని పూల్‌బాగ్ కాలనీ మంగళ వీధి తదితర ప్రాంతాల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్ర స్వామి మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో జరిగిన అభివద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు ఎమ్మెల్యేగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి చేసిన అభివృద్ధి సంక్షేమాలను గుర్తించి ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా చంద్రశేఖర్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తూ సేవ చేసిన వీరభద్ర స్వామిని గెలిపించాలని కోరారు. నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు, గదుల సత్యలత, యువజన విభాగం అధ్యక్షుడు ధనరాజ్ పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల

వైసిపిలో 400 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి - పూసపాటిరేగ

అభివృద్ధి, సంక్షేమం చేస్తున్న ఈ ప్రభుత్వానికి మరోసారి అవకాశం ఇవ్వాలని నెల్లిమర్ల వైసిపి ఎమ్యేల్యే అభ్యర్థి బడ్డకొండ అప్పలనాయుడు కోరారు. మంగళవారం మండలంలోని చోడమ్మ అగ్రహారంలో ఎన్నికల ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా కార్మికనాయకుడు, మాజీ సర్పంచి నల్ల అప్పలరాజుతో పాటు వార్డు మెంబర్లు వాళ్లే జయరాం, జి. అప్పన్నతో సహ 400 కుటుంబాలు వైసిపి తీర్థం పుచ్చుకున్నాయి. వారందరికి ఎమ్మెల్యే బడ్డుకొండ కండువాలు కప్పి పార్టీలోకి ఆవ్వానించారు. వారితో పాటు నాలుగు మండలాలకు చెందిన 1800 మంది కార్మికులు బడ్డుకొండకు మద్దతు తెలిపారు. ప్రచారంలో వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి లు అల్లాడ రమేష్, ఎన్. సత్యనారాయరాజు, చోడమ్మ అగ్రహారం సర్పంచి పిళ్లా శ్రీరాములు, నాయకులు మహంతి జనార్ధనరావు, దాడిశెట్టి త్రినాదరావు తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

గిరిజన హక్కులను కాలరాస్తున్న బిజెపి

ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న బిజెపి నుంచి దేశాన్ని కాపాడాలని కోరారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని, దేశ ఐక్యతను దెబ్బతీస్తోందన్నారు. బడుగు బలహీన వర్గాలకు కల్పిస్తున్న రిజర్వేషన్లను హక్కులు నిర్వీర్యం చేస్తుందని అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ బిజెపి అవలంభిస్తున్న విధానాలు దేశ ఆర్థిక సామాజిక, స్వావలంభనకు తీవ్ర నష్టం చేస్తున్నాయని అన్నారు. అలాంటి బిజెపిని రాష్ట్రంలో వైసిపి, తెలుగుదేశం పార్టీలు బలపరచడం దుర్మార్గమైన చర్యని అన్నారు. దేశాన్ని మత ప్రాతిపదికను విడగొట్టడానికి సిఎఎ, ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్ లాంటి చట్టాలు తీసుకువస్తూ వ్యతిరేకిస్తున్న వారిపై ఉపా వంటి దేశద్రోహ చట్టాన్ని అక్రమంగా మోపి నిర్బంధిస్తున్నారని అన్నారు. కావున రానున్న ఎన్నికలలో బిజెపిని, దాన్ని బలపరిచే టిడిపి, జనసేన, వైసిపిలను ఓడించాలని, ప్రగతిశీల వామపక్ష అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన సమయంలో గ్యాస్ ధర 400రూపాయలుంటే ఇప్పుడు 1200 రూపాయలకు పెరిగిందన్నారు .దేశ సంపదని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ లకు అమ్మేస్తోందని చెప్పారు. మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చాలని కంకణం కట్టుకున్నదని చెప్పారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రయివేటీకరణ చేస్తుంటే ప్రశ్నిస్తానని పార్టీ పెట్టిన పవన్ కళ్యాణ్ నోరు మెదపడం లేదని చెప్పారు. బ్యాంకులను మోసం చేసిన మాజీ ఎంపీ కొత్తపల్లి గీత అరకు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని చెప్పారు. ఉన్నత విద్యావంతుడు,యువకుడైన అప్పలనర్సను ఎంపీగా గెలిపించాలని కోరారు. సాలూరులో సిపిఐ నాయకులు ఎస్.రామచంద్రరావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ఎస్.బంగారయ్య, నాయకులు గేదెల రామకృష్ణ, సిపిఎం మెంటాడ మండల కార్యదర్శి రాకోటి రాములు, సాలూరు మండలం కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, పాచి పెంట మండలం కార్యదర్శి కోరాడ ఈశ్వరరావు, మక్కువ మండల నాయకులు ప్రభాకర్, పట్టణ కార్యదర్శి ఎన్‌వై నాయుడు పాల్గొన్నారు. బలిజిపేటలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డివేణు, నాయకులు గేదెల సత్యనారాయణ, యమ్మల మన్మధరావు మండల నాయకులు భాను వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్‌కు అనుమతులేవి?

అధికారులకు తప్పుడు నివేదికలు ఇస్తున్నారని చెబుతున్నారు. పరిశీలనకు వచ్చిన అధికారులు ఫిర్యాదు దారుల సమక్షంలో దర్యాప్తు చేయకుండా కాసులకు కక్కుర్తి పడి తూతూ మంత్రంగా చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి అక్రమ మైనింగ్‌పై దృష్టి పెట్టి దర్యాప్తు చేసి గిరిజన ప్రజలకు ప్రాణహాని జరగకుండా తగు చర్యలు చేపట్టాలని గిరిజనులు వి.గౌరినాయుడు, పోతుబంది కన్నయ్య దొర, శ్రీను, సీతారాం, వి మహేష్, అప్పలరాజు, నూకరత్నం కోరుతున్నారు

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS AT KHAMMAM

DISPUTE NO. 173 OF 2020

M/s.Kapil Chits (Telangana) Private Limited, H.No. 15-169, 1st Floor, NVR Complex, Near Bus Stand, Sathupally, Khammam District, Represented by its Branch Manager Cum Foreman,

...DISPUTANT

VERSUS

Mr. Madakam Prakash Dora,& 3 Others

To

Opponent No.1. Mr. Madakam Prakash Dora, S/o. PapeRao, Age: 33 years,Occ: Head Constable TSSP, B Gangaram, R/o. H.No.2-97, Vodulkonda Village, Addatheegala Mandal, East Godhavari District.533428

Opponent No.2. Kunjem Venkanna Dora, S/o. Pandavulu Dora, Age:35years, Occ: Head Constable TSSP B Gangaram, R/o. H.No.4-7, Chinna Baringi Village, Ropa Chodavaram Mandal, East Godhavari District.533288.

Opponent No.4. Pattika Madhava Rao, S/o. Neelakantham, Age: 37 years, Occ: Head Constable TSSP B Gangaram, R/o. H.No.37, Podi Post, Kurupam Mandal, Vizianagaram District.535523.

...OPPONENTS

Whereas the disputant file the above Arbitration/ Dispute for the recovery of the money of **Rs. 85,000=00** against you and others and where as the above Arbitration/ Dispute is posted to 07-05-2024 for your appearance.

Take Notice that in default of your appearance in person before the Deputy Registrar of Chits/Arbitrator, Khammam on the above said date at 11:30 AM the matter will be determined setting you exparte.

Chit Arbitrator,
Deputy Registrar of Chits,
Khammam.

చంద్రబాబును కలిసిన పివిఆర్

ప్రజాశక్తి- భోగాపురం

తెలగ కులస్తులను బిసిల జాబితాలో చేర్చాలని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును తెలగ రిజర్వేషన్ ఉద్యమ నేత పల్లంట్ల వెంకట రామారావు కోరారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో మంగళవారం చంద్రబాబు నాయుడుకు ఆయన వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన చంద్రబాబు నాయుడు దీనిపై పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ అంశాన్ని పరిశీలించాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్ నాయుడుకు సూచించారు. అనంతరం తన దృష్టికి కూడా తీసుకురావాలని ఆయన వారిద్దరికీ సూచించారు. తెలగ రిజర్వేషన్ ఉద్యమ పెద్దలు దుప్పలపూడి శ్రీనివాసరావు, ముప్పుడు సురేష్, అల్లాడ శ్రీనివాసరావు, గట్టి రఘు, పాసుపు శ్రీనివాసరావు, పసుపులేటి గోపి, ఆకిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు కమిటీలతో అదితి సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం కోట

పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాలో మంగళవారం టిడిపి అభ్యర్థి అదితి విజయలక్ష్మి మంగళవారం పలు వార్డుల అధ్యక్ష కార్యదర్శులతో సమావేశమయ్యారు. బూత్ ల వారీగా ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు నాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వివరించాలని సూచించారు. చంద్రన్న బీమా, చంద్రన్న పెళ్లి కానుక ఇలా అన్ని హామీలను వివరించి టిడిపికి ఓటు వేయాలని కోరాలని తెలిపారు. ఓటరు వెరిఫికేషన్ పూర్తి చేయాలని, 85 ఏళ్లు దాటిన ఓటర్లును, 18 - 24 సంవత్సరాల వయసు గల కొత్త ఓటర్లను గుర్తించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, పిల్లా విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గంజాయితో ముగ్గురు అరెస్టు

పార్వతీపురంటౌన్: 8 కిలోల గంజాయితో ముగ్గుర్ని అరెస్ట్ చేసినట్టు పట్టణ సిఐ కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు స్థానికపట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సంతోష్ కుమారితో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక పట్టణ పోలీసులకు ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు పట్టణ మహిళా ఎస్ఐ సంతోషి కుమారి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో కలిసి పట్టణంలో చినమాదిగ వీధికి చెందిన నిడగంటి జ్యోతి, బొబ్బిలిలోని దాసర వీధికి చెందిన నక్క వెంకటేష్ కర్ణాటక రాష్ట్రానికి చెందిన లోహిత్‌ను అదుపులోకి తీసుకుని వారి నుండి రెండు బస్తాలతో ఉన్న 8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు. నిడగంటి జ్యోతి నక్క వెంకటేష్ ద్వారా ఒడిస్సా నుండి గంజాయిని తెప్పించి, యువకులకు చిన్నచిన్న పొట్లాలు కట్టి విక్రయిస్తుందని, ఆమె నుండి కర్ణాటక చెందిన లోహిత్ అనే వ్యక్తి గంజాయి కొనుక్కొని కర్ణాటక తీసుకెళ్తున్నట్టు తెలిపారు. ఇదిలా ఉండగా గంజాయి విక్రయిస్తున్న నిడగంటి జ్యోతి పట్టణంలోని ఐదో వార్డు సచివాలయం పరిధిలో వాలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్నట్టు తెలిసింది.

విజయనగరం కోట: విజయనగరం రైల్వే స్టేషను వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా మహారాష్ట్రకు చెందిన ఒక వ్యక్తిని అరెస్టు చేసి, అతని నుండి 8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వన్ టౌన్ సిఐ బి.వెంకటరావు తెలిపారు. రైల్వే స్టేషను వద్ద ఎస్సై హరిబాబు నాయుడు , సిబ్బంది తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లుగా వచ్చిన సమాచారం మేరకు అదుపులోకి తీసుకొని, బ్యాగులు తనిఖీ చేయగా 8 కిలోల గంజాయి లభ్యమయ్యిందన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సమక్షంలో సీజ్ చేశామన్నారు. అరెస్టు అయిన వారు మహారాష్ట్రకు చెందిన పింటూ అంబదాస్ షిండే అని, అతనిని రిమాండ్ కు తరలించామని తెలిపారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అక్రమ మద్యం బాటిళ్లు కలిగిన వ్యక్తిని మంగళ వారం స్థానిక ఎస్ఐ డి.రామగణేష్ పట్టుకున్నారు. సతివాడ గ్రామ శివారులో అక్రమ మద్యం బాటిళ్లు కలిగిన వ్యక్తిని పట్టుకొని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వ్యక్తి వద్ద 38 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

నాటు సారా అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - కొమరాడ

నాటుసారా అమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై నీలకంఠం తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ తమకు వచ్చిన సమాచారం పై గుమడకు చెందిన బొచ్చ మధుసూదనరావు కల్లికోట వద్ద నాటు సారా అమ్ముతుండగా సమాచారం వచ్చిందన్నారు. అమ్ముతున్న వ్యక్తిని పట్టుకుని అతని వద్ద గల సుమారు 200 నాటు సారా ప్యాకెట్లను పట్టుకుని అతన్ని అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్టు తెలిపారు.

రాయుడు పేటలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వీలుపర్తిలో గల ప్లాంటేషన్ అగ్నికి ఆహుతైంది. సమాచారాన్ని గ్రామస్తులు ఎస్ కోట అగ్నిమాపక సిబ్బందికి ఇవ్వడంతో హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 40వేలు ఆస్తినష్టం ఉంటుందని అంచనా వేశారు. సిగరెట్టు కాల్చి పడేయడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని తలిస్తోంది.

ఎన్నికల కోడ్‌పక్కాగా అమలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఎన్నికల కోడ్ పగడ్బందీగా అమలు జరిగేలా అడ్మిన్ కార్యదర్శులు చూడాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు ఆదేశించారు. మంగళవారం కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికల నిబంధనలు అమలు, నామినేషన్‌లు వేసిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. ఎన్నికల కోడ్ నిబంధనలు ఏవైతే ఉన్నాయో వాటిని సక్రమంగా అమలు జరిగేలా చూడాలన్నారు. అతిక్రమిస్తే నిబంధనలు మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. 2024-25 ఏడాదికి సంబంధించిన ఆస్తి పన్ను ముందుగా చెల్లిస్తే 5 శాతం రిబేట్ ఇస్తున్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో టౌన్ ప్లానింగ్ ఎసిపి లు మధుసూదనరావు, అమ్మాజీరావు, సచివలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
బుధవారం
17 ఏప్రిల్ 2024

ముగ్గురు మంత్రులను ఓడించిన శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న శంబంగి వెంకట చిన అప్పలనాయుడు గతంలో ముగ్గురు మంత్రులను ఓడించారు. టిడిపి ఆవిర్భావం తర్వాత 1983లో జరిగిన ఎన్నికల్లో అప్పటిలో మంత్రిగా పని చేసిన కాంగ్రెస్(ఐ) అభ్యర్థి వాసిరెడ్డి కృష్ణమూర్తిపై శంబంగి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి 16,950 ఓట్లు మెజారిటీతో విజయం సాధించారు. 1994లో జరిగిన ఎన్నికల్లో అప్పటి మంత్రి, కాంగ్రెసు(ఐ) అభ్యర్థి పెద్దింటి జగన్మోహన్ రావుపై టిడిపి నుంచి పోటీ చేసిన శంబంగి 6087 ఓట్లు మెజారిటీతో విజయం సాధించారు. 2019లో జరిగిన ఎన్నికల్లో అప్పటి మంత్రి, టిడిపి అభ్యర్థి సుజయకృష్ణ రంగారావుపై వైసిపి అభ్యర్థిగా శంబంగి పోటీ చేసి 8352 ఓట్లు మెజారిటీతో విజయం సాధించారు. ముగ్గురు మంత్రులను ఓడించి అరుదైన రికార్డును శంబంగి వెంకట చిన అప్పలనాయుడు సొంతం చేసుకున్నారు.

ఉద్దండుల కుటుంబాల నుండే...

ప్రజాశక్తి - పాలకొండ

రాజకీయ ఉద్దండుల కుటుంబం నుండే వైసీపీ అభ్యర్థి కళావతి, జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణ పోటీలో ఉన్నారు. కొత్తూరు నియోజకవర్గం నుంచి తమ తండ్రులు ఎమ్మెల్యేలుగా గెలిచి చట్టసభలకు వెళ్లిన చరిత్ర ఉంది. నిమ్మక జయకష్ణ తండ్రి నిమ్మక గోపాలరావు 1972, 1978 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఓటమి పాలవ్వగా, 1983లో టిడిపి తరుపున ఎమ్మెల్యేగా గెలిచారు. 1985లో ఓటమి పాలై మళ్లీ 1989, 1994, 1999 ఎన్నికల్లో మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అలాగే విశ్వాసరాయి కళావతి తండ్రి వండవదొర 1962లో పార్వతీపురం ఎంపీగా ఓటమి పాలై 1967లో ఎంపీగా గెలుపొందారు. 1972, 1978, 1985లో కొత్తూరు ఎమ్మెల్యేగా గెలుపొందారు.

తొలి ముఖ్యమంత్రిని అందించిన ఎస్.కోట

ప్రజాశక్తి-శృంగవరపుకోట

శృంగవరపుకోట నియోజకవర్గం పేరు వినగానే విశాఖ -అరకు ఏజెన్సీకి ముఖద్వారంగా ఉన్న సంగతి ఇట్టే గుర్తుకొస్తుంది, ఈ నియోజకవర్గానికి ఘనమైన చరిత్ర ఉంది. 1952లో ఏర్పడిన ఈ నియోజకవర్గం కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి టంగుటూరి ప్రకాశం పంతులును తొలి ముఖ్యమంత్రిగా అందించిన ఘనతను సొంతం చేసుకుంది. మొట్టమొదటి ఎమ్మెల్యే ప్రజా సోషలిస్ట్ పార్టీకి చెందిన చాగంటి సోమయాజులు అయినప్పటికీ ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన సందర్భంగా టంగుటూరి ప్రకాశం పంతులను ముఖ్యమంత్రిని చేయడం కోసం ప్రజలతో ఏకీభవించి సోమయాజులు తన పదవిని త్యాగం చేశారు.



శృంగవరపుకో నియోజకవర్గం 1952లో ఏర్పాటైంది. ఎస్.కోట, లక్కవరపుకోట, వేపాడ, జామి మండలాలు ఈ నియోజకవర్గంలో ఉన్నాయి. ఆంధ్రకేసరిగా ఆంధ్రుల అభిమానాన్ని చూరగొన్న టంగుటూరి ప్రకాశం పంతులు ఒకసారి ఉప ఎన్నికల్లో ఎన్నికై ప్రాతినిధ్యం వహించారు. ఇప్పటివరకు రెండు ఉప ఎన్నికలతో సహా 17సార్లు ఎన్నికలు జరగ్గా, సోషలిస్టు పార్టీ ఒకసారి, ప్రజాసోషలిస్టు పార్టీ రెండుసార్లు, కాంగ్రెస్, కాంగ్రెస్ఐ ఐదుసార్లు గెలుపొందగా, టిడిపి ఏడుసార్లు గెలుపొందగా, వైసిపి ఒకసారి గెలుపొందాయి.

ఈ నియోజకవర్గానికి ఇద్దరు ఎమ్మెల్యేల ప్రాతినిధ్యం

1955లో శృంగవరపుకోట నియోజకవర్గానికి ఇద్దరు ఎమ్మెల్యేలను ఎన్నుకున్నారు. ద్విశాసన సభగా ఇక్కడ ఇద్దరు ఎమ్మెల్యేలు ఎన్నిక కాగా, ఒకరు గిరిజనులకు, ఎస్ఎ గిరిజనేత రులకు ప్రాతినిధ్యం వహించారు. ఎస్టి స్థానానికి ప్రజా సోషలిస్ట్ పార్టీ నుంచి గుజ్జల రాముునాయుడు, కాంగ్రెస్ నుంచి కె. వీరన్న పోటీపడ్డారు ఈ ఎన్నికల్లో గుజ్జల రామునాయుడుకు గిరిజనులు పట్టం కట్టారు, అలాగే గిరిజనేతర స్థానానికి ప్రజా సోషలిస్ట్ పార్టీ నుంచి చాగంటి వెంకట సోమయాజులు స్వతంత్ర అభ్యర్థిగా గొర్రిపాటి బుచ్చి అప్పారావు పోటీ పడగా ఓటర్లు సోమయాజులకు విజయాన్ని అందించారు. గెలుపొందిన వీరిద్దరూ ఒకేసారి ఒకే స్థానానికి 1955 నుండి 1960 సంవత్సరం వరకు ఎమ్మెల్యేలుగా పని చేయడం గమనార్హం. ఇక్కడ ప్రజలు ప్రతిసారి విలక్షణమైన తీర్పునే అందిస్తూ వచ్చారు. ఇప్పటివరకు జరిగిన ఎన్నికలో ఎక్కువసార్లు టిడిపికే పట్టం కట్టారు.

ఈ నియోజకవర్గంలో అత్యధిక, అత్యల్ప మెజార్టీ

వరుస విజయాలు అందుకున్న ఎల్ బి దుక్కు
అత్యధిక సార్లు టిడిపిదే పైచేయి

టిడిపిదే..1983 తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి 2004 ఎన్నికల్లో ఒకసారి, 2019 ఎన్నికల్లో మరోసారి తప్ప మిగిలిన అన్ని ఎన్నికల్లోను టిడిపి విజయం సాధించింది. నాలుగు సార్లు ప్రజా స్వాతంత్ర పార్టీ, మరో నాలుగు సార్లు కాంగ్రెస్ విజయం సాధించగా ఒకసారి ఇండియన్ నేషనల్ డెమోక్రసీ పార్టీ తరపున కోళ్ల అప్పలనాయుడు గెలుపొందారు.

నియోజకవర్గ పరిధిలో

శృంగవరపుకోట, కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ మండలాలతో పాటు జామి మండలంలో 13 పంచాయతీలు ఉఉన్నాయి.

పునర్విభజనతో......

1978 నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. శృంగవరపుకోట, వేపాడ, జామి, విశాఖ జిల్లా అనంతగిరి, అరకు మండలాలతో కలిపి ఈ నియోజకవర్గం రూపుదిద్దుకుంది. 2009 వరకు గిరిజన నియోజకవర్గంగా కొనసాగింది. నియోజకవర్గ ఆరంభంలో దూరు సన్యాసి దొర, నియోజకవర్గం రద్దు జరిగే ముందు 2004లో కుంభ రవిబాబు మాత్రమే కాంగ్రెస్ తరపు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1983లో టిడిపి నుండి గెలుపొందిన ఎల్‌బి దుక్కు వెనక్కి తిరిగి చూడలేదు. 1994 వరకు నాలుగు పర్యాయాలు ఏక చక్రాధిపత్యం వహించారు. ఈ నియోజకవర్గ నుంచి అత్యధిక సార్లు గెలుపొందిన వ్యక్తిగా రికార్డు ఉంది, అప్పటినుంచి ఇప్పటివరకు టిడిపికి ఈ నియోజకవర్గం కంచుకోటలా ఉంది. గిరిజన నియోజకవర్గంగా ఉన్నప్పుడు 2004లో కుంభ రవిబాబు (కాంగ్రెస్), 2009 జనరల్ గా మారిన తరువాత 2009, 2014లో మాజీ మంత్రి కోళ్ల అప్పలనాయుడు వారసురాలుగా రాజకీయ రంగ ప్రవేశం చేసిన కోడలు కోళ్ల లలిత కుమారి టిడిపి నుండి గెలుపొందారు. 2019 ఎన్నికల్లో కడుబండి శ్రీనివాసరావు (వైసిపి) నుంచి విజయం సాధించారు, 2024లో టిడిపి నుండి మళ్లీ లలిత కుమారి, వైసిపి నుంచి కడుబండి శ్రీనివాసరావు మరోసారి పోటీ చేస్తున్నారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేశా : రాజన్నదొర

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశానని, వందల కోట్ల రూపాయల నిధులతో రహదారులు, బ్రిడ్జిలు తాగునీటి సౌకర్యం కల్పించానని డిప్యూటీ సిఎం పి.రాజన్న దొర అన్నారు. మండలంలోని సతాబిలో మంగళవారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. మండలంలోని గిరిజన ప్రాంతాల్లో ప్రతి మారుమూల గ్రామానికి రోడ్డు, తాగునీరు, బ్రిడ్జిల సౌకర్యం కల్పించానని, విద్య, వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చానని తెలిపారు. ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుని హామీలన్నీ నెరవేర్చాలని, మిమ్మల్లి ఓటు అడిగే అర్హత నాకే ఉందని అన్నారు. మీరంతా ఫ్యాన్ గుర్తుకే ఓటేయాలని కోరారు. సమావేశంలో గొట్టూరు, శదాభి, మూటకూడు, గరిసి గుడ్డి, తంగలం తదితర పంచాయతీలకు చెందిన గిరిజనులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి వైస్‌చైర్మన్ కె.సింహాచలం, రిటైర్డ్‌ఎక్సైజ్ శాఖ సూపరిండెంట్ చింతగాడ దాసు, నాయకులు డోల బాబ్జీ, టి.గౌరీశ్వరరావు, గొట్టాపు ముత్యాల నాయుడు, పి.వీరమనాయుడు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొమరాడ : మండలంలోని పరుశు రాంపురం, గుణనపురం, అర్తం గ్రామాల్లో ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్ధన్, జడ్పిటిసి లక్ష్మి, వైస్ ఎంపిపి శరత్ బాబు, నాయకులు శెట్టి మధుసూదన్ రావు, ఎం.సూరపునాయుడు, మల్లిబాబు, పైలా వెంకటరమణ, బి.ముత్యాలు, చింతాడ అప్పలనాయుడు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బొబ్బిలి : పట్టణంలోని స్వామివారివీధిలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఎన్నికల ప్రచారం చేశారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చిన వైసిపికి ఓట్లు వేసి మద్దతు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే , ఆయన సోదరుడు శంబంగి వేణుగోపాలనాయుడు, కుమారుడు శ్రీకాంత్ మూడు బృందాలుగా ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

డెంకాడ: ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పల నాయుడు, ఎమ్‌పి అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్‌కు మద్దతుగా మండలంలోని గుణుపూర్ పేటలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, జోనల్ ఐటీ వింగ్ ఇన్చార్జి బడ్డుకొండ మణిదీప్ నాయుడు, బడ్డుకొండ ప్రదీప్ నాయుడు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మునాయుడు, డెంకాడ పిఎస్‌సిఎస్ చైర్మన్ రొంగలి కనక సింహాచలం, పతివాడ కృష్ణ వేణి, సర్పంచ్ పైలు ముత్యాలరావు, ఉప సర్పంచ్ బడ్డుకొండ చిన్న, ఎంపిటిసి బడ్డుకొండ రామనాయుడు, నాయ కులు రమణ, పైడ్రాజు పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : మండలంలోని ధర్మవరంలో వైసిపి తరపున పోటీ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు, ఎమ్‌పి బొత్స ఝాన్సీ లక్ష్మికి మద్దతుగా జిసిసి చైర్ పర్సన్ శోభ స్వాతి రాణి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎం.వెంకటలక్ష్మి, మండలంలో ఉన్న సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో చేరికలు

కొత్తవలస: స్థానిక వైసిపి క్యాంపు కార్యాలయం వద్ద ఎస్.కోట ఆటో స్టాండ్ యూనియన్‌కి చెందిన లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర థియేటర్ ఓనర్ పాలకుర్తి హరినాథ్ అతను అనుచరులు 45 మంది ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫోక్ అండ్ కల్చరల్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైసిపి మండల అద్యక్షుడు మోపాడ కుమార్, జామి మండల అధ్యక్షుడు గొర్లె రవి, ఎస్.కోట పట్టణం అధ్యక్షుడు రెహమాన్, ఎలమంచిలి అప్పారావు, కోసూరు భారతి, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు. అలాగే ఎస్.కోటలోని పందిరప్పన్న జంక్షన్‌కు చెందిన యువతకులు వైసిపిలో చేరారు.

గజపతినగరం: దత్తిరాజేరు మండలం ఎస్.బూర్జవలస గ్రామానికి చెందిన 35 టిడిపి కుటుంబాలు మాజీ ఎంపిపి కంది తిరుపతి నాయుడు నాయకత్వంలో ఆ గ్రామానికి చెందిన బోని తిరుపతి, టి. భాస్కరరావు ఆధ్వర్యంలో వైసిపిలో చేరాయి. వీరందరికీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బొత్స సాయి గురు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠాపురంలో ప్రచారం చేస్తున్న సిపిఎం అభ్యర్థి రమణ, నాయకులు

సిపిఎంతోనే గ్రామాల అభివృద్ధి

ప్రజాశక్తి - కురుపాం

ఏజెన్సీ ప్రాంతలో అన్ని గిరిజన గ్రామాలు సమగ్రాభివృద్ధి సాధించాలన్నా, ఆదివాసీలు అభివృద్ధి చెందాలన్నా రానున్న ఎన్నికల్లో కురుపాం అసెంబ్లీ, అరకు పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోలక అవినాష్ పిలుపునిచ్చారు. సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మండలంలోని ఏగులవాడ, పొడి, నీలకంఠాపురం పంచాయతీల్లో గల పలు గిరిజన గ్రామాల్లో సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణతో కలిసి మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో అవినాష్ మాట్లాడుతూ అనేక గ్రామాల్లో తాగు, సాగునీరు, విద్య, వైద్యం, రహదారులు వంటి మౌలిక సౌకర్యాలు నేటికీ అనేకం మన ముందు కనిపిస్తున్నాయని, ఈ సమస్యలన్నీ టిడిపి, వైసిపి ప్రభుత్వాలు గాలికి వదిలేసి నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆదివాసీ వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని, దీనికి రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు వత్తాసు పలికి, ఆదివాసీలకు తీరని అన్యాయం చేస్తున్నాయని అన్నారు. కావున ఆదివాసీలను కాపాడాలంటే ఎర్రజెండా పార్టీలకు మద్దతు తెలియజేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు వి.వాసుదేవరావు, ఎం.సన్యాసి, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు 280 దరఖాస్తులు

పాలకొండ : పోస్టల్ బ్యాలెటుకు 208 దరఖాస్తులు వచ్చాయి. మండలంలో ఇక్కడ ఓటు ఉండీ, వేరే ప్రాంతంలో ఉద్యోగం చేస్తున్న వారు దరఖాస్తులు ఇస్తున్నారు. అయితే ఈ పోస్టల్ బ్యాలెటు ఓటు ఎవరికి వరిస్తుందో చూడాల్సి ఉంది. 2019 ఎలక్షన్‌లో నియోజకవర్గంలో 1354 పోస్టల్ బ్యాలెటు ఓట్లు నమోదు కాగా, అందులో 1124ఓట్లు వైసీపీకే దక్కాయి. అయితే ఈసారి ఉద్యోగుల ఓట్లు ఎవరి పక్క ఉంటుందో వేచి చూడాల్సి ఉంది.

చెల్లికి తోడుగా ప్రచారం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వాళ్ళిద్దరూ ఒకే కుటుంబానికి చెందిన అక్క చెల్లెలు. ఒకే పార్టీలో ఉన్నా నిన్న మొన్నటి వరకు గ్రూపులుగా ఉండడంతో ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహరించారు. టిడిపి అధిష్టానం గ్రూపులు వీడి కలిసికట్టుగా పని చేయాలని ఆదేశించడంతో గుమ్మలక్ష్మీపురంలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి తోడుగా అక్క బిడ్డిక పద్మావతి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

ప్రచారంలో పాల్గొన్న టిడిపి అభ్యర్థి జగదీశ్వరి, సోదరి దమయంతి

గిరిజన గ్రామాల్లో బేబినాయన ప్రచారం

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

టిడిపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన మంగళవారం గిరిజన గ్రామాలైన మోసురువలస, ఎరకమందొర వలస, డొంగురువలస, చిలకమ్మవలస, కొత్తవలస, కేసాయివలస, విజయ పూరి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గిరిజనులతో ఆయన దింస్సా నృత్యం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల సమస్యలు తనకు తెలుసన్నారు. తనను ఎన్నికల్లో గెలిపిస్తే గ్రామాలకు రోడ్లు, ఇంటి వద్దకే రేషన్ సరుకులు, అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తామన్నారు. సైకిల్ గుర్తు పై ఓటు వేసి తనను, ఎమ్‌పి అభ్యర్థి కె.అప్పలనాయుడును గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు ఏ.భాస్కరరావు, వి.సత్యనారాయణ, కేశవ, వసంత తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: మసి పూసి మారేడు కాయ చూపే వారికి ఈ ఎన్నికల్లో ఓట్లు వేయరాదని బేబీనాయన అన్నారు. మంగళవారం మండల పరిదిలో గిరిజన గ్రామాలైన జోగిందరవలస, క్రరిందరవలస గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయన మాట్లాడుతూ బొబ్బిలిని ఆదర్శ నియోజక వర్గంగా తీర్చి దిద్దుతానని అన్నారు. గిరిజనుల సమస్యలు పరిష్కరించి ప్రభుత్వ మిగులు భూములు ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతి నాయుడు, బిసి సెల్ ఉపాధ్యక్షులు క్రోతు తిరుపతి రావు, జోగయ్య, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం టిడిపి అభ్యర్థి తోయక జగదీశ్వరి గుమ్మ లక్ష్మీపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టో ప్రజలకు వివరించారు. అనంతరం ఎల్విన్‌పేటలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొని ఆమె మాట్లాడారు. వైసిపి ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి కురుపాం నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. పదేళ్ల అనంతరం ఎన్నికలకు ముందు రోడ్ల శంకుస్థాపనకు కొబ్బరికాయలు కొడుతున్నారంటే ఈ పదేళ్లలో ఏం మేరకు అభివృద్ధి అయిందో ప్రజలే గుర్తించాలన్నారు. కొబ్బరికాయల మాజీ మంత్రి ఎవరైనా ఉన్నారు అంటే అది పుష్ప శ్రీవాణి అనిఎద్దేవా చేశారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ దేవ్ మాట్లాడుతూ టిడిపి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర సమన్వయకర్త దత్తి లక్ష్మణరావు, అరుకు పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు, రాష్ట్ర యువ విభాగం నాయకులు కోలా రంజిత్ కుమార్, జనసేన నియోజకవర్గం సమన్వయ కర్త క్రడక మల్లేశ్వరరావు, మండల కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, బిజెపి మండల కన్వీనర్ పెద్దింటి దివాకర్, నాయకులు బిడ్డిక పద్మావతి, వెంపటాపు భారతి, క్రడక కళావతి, మండంగి భూషణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భామిని : మండలంలోని బిల్లుమడ, సింగిడి, నులక జోడులో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ ఇంటింటి ప్రచారం ఆయన వెంట జనసేన నియోజకవర్గ కన్వీనరు నిమ్మల ఇబ్రం, మండల టిడిపి అధ్యక్షులు బోగాపురపు రవినాయుడు, ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్, మాజీ ఎంపీపీ భూపతి ఆనంద రావు, జనసేన అధ్యక్షులు రంకు కిరణ్, స్థానిక నాయకులు భూష సూర్యారావు, బర్రి కాశిరావు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో భారీ చేరికలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ నాయకులు, కార్యకర్తలు పార్టీలు మారడం సర్వసాధారణంగా మారింది. తాజాగా వైసిపికి చెందిన 49వ డివిజన్ గాజులరేగ మాజీ కౌన్సిలర్ గార సత్యనారాయణ, ఆయన సతీమణి ఉమా ఆధ్వర్యాన సుమారు వెయ్యి మంది టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. మంగళవారం స్థానిక అశోక్ బంగ్లా టిడిపి కార్యాలయంలో పట్టణ పరిధిలో గల 10వ డివిజన్ నుంచి 26 కుటుంబాలు, 26వ డివిజన్ నుంచి 35 కుటుంబాలు, 49వ డివిజన్ గాజులు రాక నుంచి సుమారు 1000 మంది దగ్గర భారీ సంఖ్యలో మందు గుండు , భాజా భజంత్రీలతో భారీ ఊరేగింపుగా తరలివచ్చారు. వీరందరికీ విజయనగరం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి పూసపాటి అతిథి విజయలక్ష్మి వారందరికీ టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అదితి మాట్లాడుతూ వైసిపి పాలనపై విసుగు చెంది టిడిపిలో చేరుతున్నారని అన్నారు.

టిడిపిలో చేరిన 49వ డివిజన్ మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ తదితరులు

ఎన్నికల ఘట్టంలో ప్రధానమైన అభ్యర్థుల ప్రచారం జోరందుకుంది. వివిధ పార్టీల నాయకులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. వీటిపై 'ప్రజాశక్తి' తన పాఠకులకు విభిన్నమైన దృశ్యాలను 'ప్రచారంలో పదనిసలు' పేరిట అందిస్తోంది.

పాచిపెంటలో జరిగిన ఎన్నికలసభలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

బొబ్బిలి స్వామి వారిధిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు

ఎస్.కోటలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సమక్షంలో చేరిన పందిరప్పన్నవీధికి చెందిన యువత

బొబ్బిలి : మోసూరువలసలో ప్రచారం చేస్తున్న టిడిపి అభ్యర్థి బేబినాయన

సింగిడి లో ఇస్త్రీ చేస్తున్న జనసేన అభ్యర్థి జయకృష్ణ

సీనియర్ ఓటర్ల గుర్తింపులో జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

85 సంవత్సరాలు నిండిన, అనారోగ్యంతో ఉన్న ఓటర్ల గుర్తింపులో జాగ్రత్తలు తీసుకోవాలని అసెంబ్లీ ఎన్నికల అధికారి ఏ.సాయిశ్రీ అన్నారు. మంగళవారం స్థానిక ట్రెజరీ కార్యాలయ ఆవరణలో సెక్టోరల్ అధికారులు, బిఎల్ఒలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం నూతనంగా 85 సంవత్సరాలు నిండిన ఓటర్లు, దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఓటర్లు ఇంటి వద్దే ఓటు వినియోగించుకొనే విధానాన్ని తీసుకు వచ్చిందని ఆ ఓటర్ల గుర్తింపులో (ఫారం 12డి) సెక్టోరల్ అధికారుల, బియల్ఒల సంతకాలు తప్పని సరిగా ఉండాలని దీనిని నిర్లక్ష్యం చేస్తే తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ప్రక్రియ వచ్చే 5,6 తేదీలకు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్

బొబ్బిలి: సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ సాయిశ్రీ

త్రినాధ నాయుడు, ఎన్నికల డిటి సాయి కృష్ణ పాల్గొన్నారు.

నామినేషన్లకు అన్ని ఏర్పాట్లూ చేసాం:ఆర్‌డిఒ

చీపురుపల్లి: ఈ నెల 18 నుండి ప్రారంభం కానున్న నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి అన్ని ఏర్పాట్లునూ పూర్తి చేసామని చీపురుపల్లి ఆర్‌డిఒ బి. శాంతి తెలిపారు. మంగళవారం స్థానిక రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 18న ఎన్నికల షెడ్యూల్ రానుందన్నారు. అదే రోజు నుండి ఈ నెల 25 వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. 26న స్క్రూటినీ, 27 నుండి 29 వరకు నామినేషన్లు ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. మే 13న ఎన్నిక జరుగుతుందన్నారు. నామినేషన్లకు సంబంధించి జాతీయ, ప్రాంతీయ పార్టీలకు చెందిన అభ్యర్థులకు ఒక ప్రపోజల్, స్వతంత్ర, గుర్తింపు లేని పార్టీలకు చెందిన అభ్యర్థులకు పది మంది ప్రపోజల్స్ ఉండాలన్నారు. నామినేషన్లు వేసే అభ్యర్థులు 18వ తేదీ నుండి 25వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల పత్రాలను తీసుకురావాలని ఆమె తెలిపారు.

తవ్వేసిన రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం పంచాయతీ కొల్లిపేట గ్రామంలో రోడ్డు తవ్వేసారననే ఫిర్యాదుపై సంబంధిత జె.ఇ దుర్గా వెంకటేష్ మంగళవారం పరిశీలించారు. చాకివలస వెళ్లే రహదారిలో ఏకంగా తన ఇంటికి పైప్ లైన్ కోసం సుమర్ అర కిలోమీటర్ అనుమతులు లేకుండా రోడ్డు తవ్వేశారని ఒక వ్యక్తి ఫిర్యాదు చేయడంతో ఆయన ఈ రోడ్డును పరిశీలించారు. దీనికి జలజీవన్ మిషన్‌లో ఏమైనా అనుమతులున్నాయా అని గ్రామీణ నీటి సరఫరా విభాగం జె.ఇతో మాట్లాడానని జెఇ తెలిపారు. దీనిపై ఆ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

గ్యాస్ లీకేజీలపై అవగాహన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

గ్యాస్ లీకేజీలపై అవగాహన కలిగి ఉండాలని పట్టణంలోని అగ్నిమాపక కార్యాలయ అధికారి షేక్ మదీనా అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ జాతీయ అగ్రిమాపక వారోత్సవాలులో భాగంగా 3వరోజు పట్టణంలోని ఎంఎస్ఆర్ రెసిడెన్సీక్ అపార్ట్మెంట్స్, సిరికి డైట్ కాలేజీ పక్కన గృహిణిలకు గ్యాస్ ప్రమాదాలు, గ్యాస్ లీకేజీ సంభవించునపుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కోట ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : అగ్నిప్రమాద నివారణ పద్ధతులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా నివారణ పద్ధతులను తెలిపే కరపత్రాన్ని పిఒ ఆవిష్కరించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలను అప్రమత్తం చేయాలని అగ్నిమాపక సిబ్బందికి సూచించారు. అగ్నిమాపక కేంద్రం ల్యాండ్ లైన్ నెంబర్ 08941 260111 అందరికీ తెలిసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు పాల్గొన్నారు

విస్తృతంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి- బొబ్బిలి

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా చీరలు, వాచీలు, ఇతర సామగ్రి, మద్యం, నగదు రవాణా కాకుండా అడ్డుకునేందుకు వాహన తనిఖీలు చేస్తున్నారు. పాతషుగర్ ఫ్యాక్టరీ సమీపంలో ఎస్ఐ లోవరాజు ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేశారు. అక్రమ రవాణా నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు లోవరాజు చెప్పారు. తనిఖీలో ఏఎస్ఐ రమణ, పాల్గొన్నారు

కాలువల్లో పూడికలు తొలగించాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

మురుగునీటి కాలువలలో ఎప్పటికప్పుడు పూడికలు తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశించారు. పట్టణంలోని సంఘవీధి, పెదచాకలివీధి, ఆకుల రెల్లివీధి, బోయవీధిలలో మంగళవారం పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలో షెడ్యూల్ ప్రకారం మురుగునీటి కాలువలలో ఎప్పటికప్పుడు పూడికలు తొలగించాలని ఆదేశించారు. కాలువలలో పూడికలు ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డిఇ రవికుమార్, ఉన్నారు.

ఘనంగా వీరేశలింగం పంతులు జయంతి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని మంగళవారం కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అలాగే నడుకూరు, బొడ్లపాడు తదితర గ్రామాల్లో ఉమ్మడి జిల్లా జనసేన జిల్లా కార్యదర్శి బిపి నాయుడు, సంయుక్త కార్యదర్శి జనసేన జానీ వీరేశలింగం పంతులు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయసిబ్బంది, విద్యార్థులు,పాల్గొన్నారు.

సస్పెండైన వాలంటీర్లపై కేసులు నమోదు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని నర్సిపురం, పెదబొండపల్లి గ్రామానికి చెందిన వాలంటీర్లు 24 మందిని ఎన్నికల నియమాళిని అతిక్రమించారన్న కారణంగా సస్పెండ్ చేసిన సంగతి విదితమే. అయితే సోమవారం వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు ఎంపిడిఒ అకిబ్ జావేద్ తెలిపారు. అలాగే మండలంలో వాలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. సోమవారం నరసాపురం, చినబొండపల్లి, డోకిశీల, ఎమ్మార్ నగరం, సంగంవలస గ్రామాలకు చెందిన 83 మంది వాలంటీర్లు తమ రాజీనామాలను ఎంపిడిఒకు సమర్పించారు.

ఆరోగ్య సురక్షకు స్పందన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఎన్‌కెఆర్ పురంలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో 404 మందికి వైద్య సేవలందించారు. వీరిలో 5 గురికి మెరుగైన వైద్య సేవలు కోసం ఎంపిక చేశారు. ఈ శిబిరంలో వేపాడ పిహెచ్‌సి వైద్యాధికారి ఎ.ధరణి, డాక్టర్ ఎ. నీల, డాక్టర్ ఎన్ ఆచారి, డాక్టర్ సిహెచ్ ఈశ్వరరావు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిహెచ్ఒ ఆంజనేయులు, పిహెచ్‌సి సిబ్బంది, గ్రామ సచివాలయం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తవలస: స్థానిక పిహెచ్‌సి పరిధిలోని బలిగొట్టంలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరానికి స్పందన లభించి

రోగితో మాట్లాడుతున్న డాక్టర్ ధరణి

ంది. ఈ శిబిరంలో 305 మందికి వైద్యాధికారి డాక్టర్ సీతల్ వర్మ, డాక్టర్ బి. సింహాద్రినాయుడు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, హెచ్. బి.మలేరియా, డెంగీ, టిబి, యూరిన్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రంలో డాక్టర్లు పొట్నూరు వరలక్ష్మి, పి.వి. ఎన్ మల్లేశ్వరావు, జ్యోతి ప్రియాంక, ఇఒ నరసింహారావు, పి.హెచ్.ఎన్ రమణమ్మ, హెచ్.వి. బేబీరాణి, హెచ్.ఎస్. సూరిదేముడు, సిబ్బంది, పాల్గొన్నారు.

శ్రీరామ నవమికి మండపేట కొబ్బరి బొండాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం శ్రీ రామనవమి వేడుకలకు మండ పేట కొబ్బరి బొండాలు మంగళవారం అందజేశారు. శ్రీరామ నవమి నాడు రామతీర్థంలో జరిగే సీతారాముల కల్యాణ వేడుకలో వినియోగించే నిమిత్తం కొబ్బరి బొండాలు తూర్పు గోదావరి జిల్లా మండపేట నుంచి శ్రీరామతీర్థం సేవా సంఘం వారు తీసుకొచ్చారు. రంగులను అద్ది, రంగురంగుల రాళ్లు, పూసలు, రిబ్బన్లతో అలంకరించిన ఈ బొండాలు వివాహ వేడుకలో సీతారాముల పాదాల చెంత ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. మండపేటకు చెందిన కాజులూరి వెంకట అచ్యుతరామారెడ్డి శ్రేష్టమైన బొండాలను సేకరించి, వాటికి ఎనామిల్, వాటర్

కొబ్బరి బొండాలను స్వీకరిస్తున్న అర్చకులు

పెయింట్లు వేసి, పూసలు, రాళ్ళ, రిబ్బన్లవంటివాటితో శంఖుచక్రాలు, తిరు నామాలు, సీతారాముల పేర్లతో ప్రత్యేకంగా కొబ్బరి బొండాలను సర్వాంగ సుందరంగా అలంకరింప చేశారు. ఈ బొండాలను శ్రీరామతీర్థం సేవా సంఘ ప్రధాన కార్యదర్శి సుదర్శనమ్ విజయ కుమార్ ఆలయ కార్యనిర్వహణాధికారి, సహాయ కమీషనర్ వై. శ్రీనివాసరావు ద్వారా అర్చకస్వాములకు అందజేశారు.

ఏరియా ఆస్పత్రిలో డిఎంఒ తనిఖీ

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షల నిర్వహణ, పని తీరును మంగళవారం జిల్లా మలేరియా అధికారి(డిఎంఒ) డాక్టర్ టి.జగన్‌మోహనరావు వైద్య బృందంతో మంగళవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోజూ నిర్వహిస్తున్న మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షల వివరాలను, ఆయా పరీక్షా పరికరాల వాడుక విధానాన్ని, రోజూ వస్తున్న జ్వర పీడితుల వివరాలను ఆరా తీశారు. ఎంఎఫ్ -7, ఎం-3 ల్యాబ్ రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. మలేరియా, డెంగీ నిర్ధారణ అయితే సంబంధిత ఐహెచ్ఐపి ఆన్లైన్ పోర్టల్‌లో నమోదు చేసి, ఉన్నతాధికారులకు సమాచారమివ్వాలని అందించాలని సూచించారు. డెంగీ నిర్ధారణ ఎలిసా పరీక్షల నివేదికలు ఎప్పటికప్పుడు సంబంధిత రికార్డుల్లో పొందుపర్చాలని ఆదేశించారు. ఆసుపత్రి, ఆరోగ్య కేంద్రాల ల్యాబ్‌లను ప్రతి వారం పరిశీలించాలని పాలకొండ సబ్ యూనిట్ అధికారి, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్లను ఆదేశించారు. ఈ పరిశీలనలో ఎఎంఒ సూర్యనారాయణ, జిల్లా విబిడి కన్సల్టెంట్ రామచంద్ర, సబ్ యూనిట్ అధికారి మోహన్ రావు, ఎంటిఎస్ భువనేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

భామిని : జిల్లాకు సంబంధించిన అంతరాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో మలేరియాపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ జగన్‌మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన ఆంధ్రా -ఒడిశా సరిహద్దు, గిరిశిఖర గ్రామమైన మనిగలో వైద్య సిబ్బంది చేపట్టిన మలేరియా నివారణా చర్యలను మంగళవారం పరిశీలించారు.

రికార్డులను తనిఖీ చేస్తున్న డిఎంఒ

వైద్య బృందంతో ఇంటింటి పర్యవేక్షణ చేస్తూ, ఇళ్ల పరిసరాల్లో దోమలు వృద్ధి చెందే ప్రదేశాలు ఏవైనా ఉన్నాయానని పరిశీలిస్తూ, ఎవరైనా జ్వర లక్షణాలతో ఉన్నారా అని ఆరా తీశారు. దోమ తెరల వినియోగంపై అక్కడి ప్రజలకు అవగాహన కల్పించారు. పనుల కోసం అంతర్‌రాష్ట్ర గ్రామాలకు వెళ్లివచ్చేవారి ఆరోగ్యస్థితి గతులపై నిఘా ఉంచాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. వీరిలో ఎవరికైనా జ్వర లక్షణాలున్నట్లు గుర్తిస్తే వెంటనే పరీక్షలు జరిపి తగు చికిత్స అందజేసి సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. గ్రామంలో అవసరమైన మందులు, జ్వర నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం భామిని, బత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని ల్యాబ్‌ను, రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ పి.సోయల్, డాక్టర్ దామోదర్‌రావు, ఎఎంఒ సూర్యనారాయణ, జిల్లా కన్సల్టెంట్ రామచంద్ర, సబ్ యూనిట్ అధికారి అప్పారావు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంకు పటిష్ట భద్రత

ప్రజాశక్తి - పాలకొండ

నియోజకవర్గానికి సంబంధించిన ఇవిఎం యంత్రాలను పాలకొండలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచి, పటిష్ట భద్రతను ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారి కల్పనకుమారి తెలిపారు. జిల్లా కేంద్రం నుంచి అసెంబ్లీకి సంబంధించిన ఇవిఎంలను రాజకీయ పార్టీలు, ఎన్నికల అధికారులు, పోలీస్ అధికారుల సమక్షంలో స్ట్రాంగ్ రూంలో భద్రపరిచి సీల్ వేశామన్నారు. అలాగే స్ట్రాంగ్ రూం భద్రతను పర్యవేక్షిస్తున్న పోలీస్ సిబ్బందికి తగు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూం ఆవరణలోకి ఇతరులు ఎవ్వరినీ అనుమతించకూడదని సూచించారు. కార్యక్రమంలో పాలకొండ సీఐ, ఎస్ఐ, సీతంపేట, పాలకొండ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని ఉపాధి పనులు చేస్తున్న కూడికలకు కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు కోరారు. మండలంలో 34 పంచాయతీల్లో ఉపాధి కూలీలు పనులు చేస్తున్నప్పటికీ ఏ ఒక్క పంచాయతీలోనూ కనీస సౌకర్యాలైన టెంట్లు, మంచినీరు, మజ్జిగకు కానీ సదుపాయం లేదన్నారు మండుటెండలో పనులు చేసి వడదెబ్బకు గురి కావాల్సిన పరిస్థితి వస్తుందని తెలిపారు. తక్షణమే ప్రభుత్వ స్పందించి ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు ఏర్పాట్లు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎండలో పనిచేస్తున్న కూలీలు

చేరికలపై స్పష్టత లేదు

ప్రజాశక్తి - పాలకొండ

కూటమి చేరికలపై స్పష్టత లేదని వైసిపి పట్టణ అధ్యక్షులు వెలమల మన్మథరావు, ప్రధాన కార్యదర్శి లిల్లీ పుష్పనాథం అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి పార్టీలో పెద్ద ఎత్తున చేరికలు జరిగినట్లు చెప్పుకుంటున్నారని, అయితే కూటమిలో ఉన్న ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి వెళ్తున్నారని అన్నారు. దీనివల్ల వైసిపికి ఒరిగేదేమీ లేదని అన్నారు. వీరితో పాటు కె.విజయ్‌కుమార్, భాసూరు కాంతారావు, మరియాదాసు, దుంపల చిన్ని, ముద్దాడ చక్రవర్తి, తదితరులు ఉన్నారు.

కోర్టుల పట్ల నమ్మకం పెరిగింది

ప్రజాశక్తి -విజయనగరం కోట

1996లో జరిగిన శిరోముండనం కేసులో విశాఖపట్నం కోర్టు నిందితుడిగా ఉన్న వైసిపి ఎమ్మెల్సీ, మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు సహా ఆరుగురు నిందితులకు న్యాయస్థానం 18 నెలల జైలు శిక్షతో పాటు రూ.2.50 లక్షల జరిమానా విధించించడం హర్షనీయమని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గోకా రమేష్ బాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ తీర్పుతో కోర్టుల పట్ల నమ్మకం పెరిగిందని అన్నారు.

గిరిజనుల చింత దళారుల చెంత

- జిసిసి ఉన్నా గిరిజనానికి సేవలు సున్నా
- చింతపండును కొనుగోలు చేయని జిసిసి
- మోసపోతున్నగిరిపుత్రులు

ప్రజాశక్తి - కురుపాం

గిరిజనులు పండించి, సేకరించిన అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసి వారికి ఆర్థికంగా ఆసరా కల్పించడానికి ప్రభుత్వం గిరిజన సహకార సంస్థ (జిసిసి) ఏర్పాటు చేసింది. అంతవరకు బాగానే ఉన్నప్పటికీ జిసిసి సేవలు మాత్రం గిరిజన ప్రజానీకానికి అందనంత దూరంలో ఉన్నాయి. అయితే జిసిసి చింతపండును కొనుగోలు చేయకపోవడంతో వారపు సంతలకు ఆటోలతో గిరిజనులు తీసుకొచ్చిన చింతపండును దళారులు చొరబడి తక్కువ రేట్లకు కొనుగోలు చేస్తున్నారు. అంతేకాక తూకంలో కూడా మోసాలకు పాల్పడుతున్నారు. దీంతో, గిరిజనులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

మండలంలో ప్రస్తుతం చింతపండు కాపుకాయడంతో గిరిజనులు చింతపండును సేకరించి విక్రయాలు చేస్తున్నారు. జిసిసి చింతపండును కొనుగోలు చేయకపోవడంతో గిరిజనులు వారపు సంతలకు తరలించి విక్రయిస్తున్నారు. ప్రభుత్వం జిసిసి ద్వారా చింతపండు కొనుగోలు చేస్తామని ప్రకటనలు కేవలం ప్రకటనగా మిగిలాయి తప్ప అమలు చేయడం లేదు. తక్కువ ధరకు దళారులు, వ్యాపారస్తులు కొనుగోలు చేయడంతో పాటు తూకాల్లో కూడా మోసాలు చేస్తుండడంతో గిరిజనులు ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం జిసిసి నుంచి చింతపండు ఎక్కడా

దళారీలు తరలించుకుపోతున్న చింతపండు

కొనుగోలు చేయడం లేదు. సంతల్లో కూడా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. మండలంలోని గురువారం జరిగిన కురుపాం వారపు సంతలో జిసిసి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయక పోవడంతో గిరిజన గ్రామాల నుంచి గిరిజనులు ఆటోలతో చింతపండును తీసుకొచ్చి అమ్ముతున్నారు. ఇదే అదునుగా చేసుకొని వ్యాపారస్తులు, దళారులు కిలో ఒక్కొక్కరు ఒక్కొక్క ధరకు రూ.40, రూ.50, 60 రూపాయలకు కొనుగోలు చేసి ప్రైవేట్ వాహనాల్లో మైదాన ప్రాంతానికి తరలిస్తున్నారు. గిరిజనులు ఎంతో కష్టపడి సేకరించిన చింతపండుకు కనీస ధర గిట్టుబాటు కాకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. జిసిసి అధికారులు దళారుల ఆగడాలకు అడ్డుకట్ట వేయకపోవడంతో దళారులు, మైదాన ప్రాంత వ్యాపారస్తులు సంతల్లో చింతపండు ను కొనుగోలు చేసి లాభాలకు అమ్ముకుంటున్నారు. తక్షణమే జిసిసి అధికారులు స్పందించి చింతపండు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరతో కొనుగోలు చేయాలని గిరిజనులు, గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

జిసిసి కొనుగోలు చేయాలి

గిరిజనులు సేకరించిన చింతపండుకు కనీస మద్దతు ధర కిలో రూ.80కు కొనుగోలు చేయాలి. జిసిసి కొనుగోలు చేయకపోవడంతో గిరిజనులు చింతపండును దళారులకు తక్కువ ధరతో విక్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు. జిసిసి సకాలంలో చింతపండును కొనుగోలు చేయకపోవడంతో మైదాన ప్రాంత వ్యాపారస్తులు, దళారులు వారికి ఇష్టం వచ్చిన ధరలతో కొనుగోలు చేస్తున్నారు. కావును జిసిసి చింతపండును కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

కోలక అవినాష్
ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు.

ఆసరా అందక అవస్థలు

ప్రజాశక్తి - పార్వతీపురం

డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం ప్రకటించిన ఆసరా పథకం అందక నేటికీ అనేక అవస్థలు పడుతున్నారు. డ్వాక్రా రుణమాఫీ పేరిట నాలుగో విడత రుణమాఫీ ఈ ఏడాది జనవరిలో వైసిపి ప్రభుత్వం విడుదల చేసింది. అయితే బ్యాంకు, వెలుగు అధికారులు రుణమాఫీల డబ్బులను జమ చేయకుండా తాత్సారం చేస్తూ తమను కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని పలువురు మహిళల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంక్, వెలుగు అధికారలు కుమ్మక్కై వారి ప్రయోజనాలకై డ్వాక్రా మహిళలకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకుండా ఆలస్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పెద బొండపల్లి ఎపిజివిబి వారు ఎక్కువ గ్రూపులకు చెల్లింపులు చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. నాలుగు నెలలుగా గ్రూపు సభ్యులు బ్యాంక్ అధికారులను అడిగితే తమకు సంబంధం లేదని, వెలుగు వారిని అడగండని సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీరా వెలుగు అధికారులను అడిగితే తమ వద్ద ఎలాంటి ఆటంకాల్లేవని బ్యాంకు వారే చెల్లింపులు ప్రాసెస్ చేయడం లేదని, ఒకరిపై ఒకరు కారణాలు చెప్పుకుంటూ తమను చాలా ఇబ్బందులు పెడుతున్నారని మహిళలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆసరా రుణమాఫీ డబ్బులు తమ ఖాతాలకు జమ చేసి ఆదుకోవాలని, లేకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని, డ్వాక్రా మహిళలు అంటున్నారు.

గిరిజనులకు తప్పని తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి -కొమరాడ

మండలంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో తాగునీటి సమస్యతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో తాగినీటి సమస్య లేకుండా చర్యలు చేపడతామని అధికారులు ప్రకటనలు చేస్తున్నా అవి కాగితాలకే పరిమితవుతున్నాయి తప్ప తమ గ్రామాల్లో తాగు నీటి సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నాగావళి నది ఆవల ఉన్న పాలెం పంచాయితీలో గల అనేక గిరిజన గ్రామాలకు సాగునీటి సౌకర్యం లేక నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న మంచిని ట్యాంకులు సక్రమంగా పనిచేయక తాగునీరందక వేసవిలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలుమార్లు ఫిర్యాదు చేసినా ఏ ఒక్క అధికారి స్పందించడంలేదని గ్రామస్తులు అంటున్నారు. దీంతో వేసవిలో దాహార్తిని గట్టెక్కించేందుకు గ్రామానికి చెందిన యువతీ యువకులతో పాటు గ్రామస్తులతో కలిసి తమ రక్షిత మంచి ట్యాంకులను తామే బాగు చేసుకుని గుక్కటి మంచినీళ్ల కోసం అనేక అవస్థలు పడుతున్నారు. మంగళవారం రావికోన, కుంభకోట, కర్లగండ, కుస్తూరు గ్రామ ప్రజలు సొంతంగా తాగునీటి కోసం పనులు చేసే పరిస్థితి ఏర్పడింది. తాగునీటి సమస్యపై అనేకమార్లు చెప్పినా ఫలితం లేకపోవడంతో గ్రామస్తులంతా కలిసి స్వచ్ఛందంగా కుళాయిలు బాగు చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికైనా అధికారులు స్పందించి గిరిజన గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించి ఇబ్బందుల్లేకుండా చూడాలని గిరిజన ప్రజలు ప్రజాప్రతితులు కోరుతున్నారు.

నలుగురు వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని మక్కువ, కాశీపట్నం, ఎ.వెంకం పేట పంచాయతీలకు చెందిన నలుగురు వాలంటీర్లు రాజీనా మా చేసినట్లు ఎంపిడిఒ దేవకుమార్ తెలిపారు. వీరి రాజీనామాలను ఆమోదించి ఉన్నతాధికారులకు చేరవేస్తామన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలో వాలంటీర్ల రాజీనామాలు పర్వం కొనసాగుతుంది. కేదారిపురం గ్రామ సచివాలయం పరిధిలో పనిచేస్తున్న 11 మంది వాలంటీర్లు మంగళవారం రాజీనామా చేసినట్లు పంచాయతీ కార్యదర్శి బిడ్డిక సురేష్ తెలిపారు. రాజీనామా పత్రాలు అందించారని తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు గడువు పెంచాలి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు పోస్టల్ బ్యాలెట్ కొరకు ఫారం-12 దాఖలు చేసేందుకు మరో వారం రోజులు గడువు పెంచాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్ మురళీమోహన్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డిఆర్ఒ జి.కేశవనాయుడుకు వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాతశాతం ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు గడువును పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో గడువు పెంచినట్లు సమాచారం ఉందని, కొన్ని జిల్లాల్లో ఓటు హక్కు వినియోగించుకునే రోజున ఫారం-12 సమర్పించే అవకాశం ఇచ్చారని వీటన్నిటిని దృష్టిలో ఉంచుకుని శాతశాతం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదుకు కలెక్టర్ సహకరించి గడువును వారం రోజులు పెంచాలని కోరారు.

గణాంక సర్వే బృందాలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - సీతంపేట

సాధారణ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కోడ్ అమలు చేసేందుకు నియమించిన స్టాటిక్ సర్వేలేన్స్ బృందాలు అప్రమత్తంగా వ్యవహరించాలని పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి అన్నారు. మంగళవారం స్టాటిక్ సర్వేలేన్స్ బృందాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ రూ.50 వేల కన్నా ఎక్కువ నగదు, రూ.10 వేల కన్నా ఎక్కువ విలువ గల వస్తువులను తీసుకొనివెళ్తే వారి దగ్గర సంబంధిత పత్రాలు ఉంటేనే విడిచిపెట్టాలని, లేకుంటే ఆ నగదు, వస్తువులను నిబంధనల ప్రకారం సీజ్ చేయాలని సూచించారు. సరిహద్దు చెక్ పోస్టుల్లో మద్యం, ఇతర నిషేధిత వస్తువులు రవాణా అయ్యే అవకాశమున్నందున అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతిరోజూ తనిఖీ చేసిన వివరాల నివేదికలను ఆర్వో కార్యాలయానికి సమర్పించాలన్నారు. కార్యక్రమంలో సీతంపేట ఎస్ఐ జగదీష్ నాయుడు, ఎస్.ఎస్.టి టీమ్ అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మజ్జిగ కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వద్ద అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని అలమండ లలిత, సురగాల సీత సహకారంతో మజ్జిగ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని గ్రంథాలయం స్థాపకులు ఈర్ల సంజీవ నాయుడు ప్రారంభించారు. ఈ కేంద్రం నిర్వహణకు సహకరించిన లలిత, సీతను అభినందించారు. కార్యక్రమంలో వృక్షప్రేమికుడు అలమండ దయానంద్, బొద్దాన వెంకటరమణ, కోట గౌరీనాథ్ గొర్రెల శ్రావణ్, పెంకి పరశురాం, కర్రి సతీష్ పెనుబోతు భాస్కర్, ఆర్ఎంపి శ్రీను పాల్గొన్నారు.

'టిడిపికి ఓటమి భయం'

ప్రజాశక్తి - సాలూరు

టిడిపి అభ్యర్థి సంధ్యారాణికి ఓటమి భయం పెట్టుకోవడం వల్లనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని పట్టణ వైసిపి యువజన విభాగం అధ్యక్షులు బవిరెడ్డి ప్రసాద్ చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల పట్టణంలోని డబ్బివీధి నుంచి 200మంది యువకులు, 40 కుటుంబాలు వైసిపి నుంచి టిడిపిలో చేరాయని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇలాంటి ప్రచారాలు ఆమె వెళ్లిన చోటల్లా జరుగుతున్నాయని అన్నారు. డబ్బివీధి కి చెందిన 15మంది జనసేన యువకులు టిడిపిలో చేరితే దాన్ని 200మంది యువకులు చేరినట్లు చెప్పుకోవడం ఆశ్చర్యంగా వుందని చెప్పారు.ఎక్కడ ఎంతోమంది టిడిపి లో చేరారో వాస్తవలెక్కలు తమకు తెలుసునని, తప్పుడు ప్రచారం చేసినంత మాత్రాన ప్రజలు నమ్మరని అన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి -జియ్యమ్మవలస

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సమస్యాత్మక గ్రామాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీసులకు సూచించారు. మంగళవారం చినమేరంగి సిఐ మంగరాజు ఆధ్వర్యంలో జియ్యమ్మవలస, గరుగుబిల్లి, చిన మేరంగి పోలీస్ స్టేషన్లో పరిధిలో గల పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. రేపు జరగబోవు ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు .ఈ కార్యక్రమంలో జియ్యమ్మవలస ఎస్ఐ.అనీష్, గరుగుబిల్లి ఎస్సై.అమన్నరావు, చినమేరంగి ఎస్సై.చిన్నంనాయుడు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - సాలూరు

సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నియోజకవర్గంలో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు సాలూరు నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి సి. విష్ణు చరణ్ మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈనెల 18 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. 18న ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదవుతుందని, ఆ రోజు నుంచే నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందని అన్నారు. నామినేషన్లను 25 వరకు దాఖలు చేయవచ్చుని, 26న నామినేషన్లను పరిశీలించడం జరుగుతుందని, నామినేషన్ల ఉపసంహరణకు చివరి ఈనెల 29 వరకు అనిచెప్పారు. నామినేషన్ల స్వీకరణలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలను వివరించారు. ప్రభుత్వ సెలవు దినాల్లో నామినేషన్లు స్వీకరించడం జరగదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్లు సింహాచలం, దిలీప్ చక్రవర్తి, ఆనంద్ కుమార్, మండల పరిషత్ అభివద్ధి అధికారి ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలను వెలికితీయడమే ధ్యేయం

ప్రజాశక్తి - వీరఘట్టం

విద్యార్థుల విద్యా ప్రమాణాలను వెలికి తీయడమే స్లాస్ ముఖ్యోద్దేశమని డిఇఒ జి.పగడాలమ్మ అన్నారు. మండలంలోని బిటివాడ, తలవరం, కూరాకుల, నడుకూరు, నడిమికెళ్ల, తెట్టంగి, వీరఘట్టం బిసి కాలనీ, వండువ, మహర్షి ప్రగతి పాఠశాలలో నాలుగో తరగతి పరీక్షలను ప్రతి గదికి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించారు. మండలంలోని ఈ పది పాఠశాలలో స్లాస్ కింద ఎంపిక చేయడం జరిగిందని స్పష్టం చేశారు. అలాగే బిటివాడలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. రానున్న విద్యా సంవత్సరానికి నాడు నేడు పనులు పూర్తి చేయాలని గుత్తేదారుని ఆదేశించారు. ఆమెతో పాటు మండల విద్యాశాఖ అధికారి ఆర్ ఆనందరావు, సిబ్బంది ఉన్నారు.

జగన్ సిఎం కాకపోతే పథకాలు రావు

ప్రజాశక్తి - సాలూరు

సిఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి కాకపోతే పేదలకు ఇంతవరకు అందిన సంక్షేమ పథకాలు అందబోవని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ రెడ్డి పద్మావతి చెప్పారు. మంగళవారం ఆమె ఎంపిటిసి సభ్యులు సీదరపు అనూష, వైసిపి నాయకులు రామ్మూర్తితో కలిసి నార్లవలస, సీతందొరవలస, జిల్లేడువలస, గాదెల వలస గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఓటర్లతో మాట్లాడుతూ నియోజకవర్గంలో మరోసారి రాజన్నదొరను ఎమ్మెల్యే గా గెలిపిస్తే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ఊపందుకుంటాయని చెప్పారు. గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలో నియోజకవర్గం ఏమీ అభివృద్ధి జరగలేదని అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే ఇప్పుడు న్న సంక్షేమ పథకాలు వుండవని చెప్పారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా నూకాలమ్మ పండగ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ఆదర్శ పాఠశాల సమీపంలో వెలిసిన నూకాలమ్మ గ్రామ దేవత తల్లి వారాల పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గౌడువీధి, శోభలతా దేవి కాలనీ ప్రజలు ప్రతి ఏటా వర్షాలు సకాలంలో కురవాలని, పంటలు బాగుండాలని కోరారు. అమ్మ వారి ఘటాలు వారి ఇంటి వద్ద నుండి మోసి గుడి వద్దకు వెళ్లి మొక్కులను తీర్చుకుంటారు.

సీతంపేటలో కురుస్తున్న వర్షం

సీతంపేటలో వర్షం

ప్రజాశక్తి - సీతంపేట

గత నెల రోజులుగాయ ఎండల తీవ్రతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు సేద తీరారు. మంగళవారం సాయంత్రం మండలంలో కురిసిన వర్షం ఉక్క పోత నుంచి ఉపశమనం కల్పించింది. ఎండలతో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రోడ్డు పైకి వెళ్లాలంటే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. రాత్రి వేళల్లో ఇళ్లలో స్లాబ్ వేడికి తట్టుకోలేక బయటకు వచ్చే పరిస్థితులు ఉన్నాయి. మరోపక్క గెడ్డల్లో బావుల్లో నీరు అడుగంటి పోయాయి. మరోవైపు వేడి గాలులు ఉక్క పోతతో చిన్నారులు వద్ధులు అల్లాడిపోతున్నారు. దీంతో వర్షం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఈ సమయంలో వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి కొంత ఉపశమనం కలిగింది

బొబ్బిలిలో చిరుజల్లులు

బొబ్బిలి : పట్టణం, పరిసర గ్రామీణ ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం చిరుజల్లులతో వర్షం కురిసింది. ఎండలు తీవ్రతతో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో చిరుజల్లులతో వర్షం కురవడంతో ప్రజలు సేద తీరారు. వర్షం చెరకు, కూరగాయలు పంటలకు అనుకూలంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామీణ వైద్యులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-విజయనగరంకోట

నగరంలోని కాప్మి హాస్పటల్‌లో గ్రామీణ వైద్యులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ మోపాడ ప్రవీణ్ కుమార్, డాక్టర్ రెడ్డి శంకర్రావు మాట్లాడుతూ బ్రెయిన్ స్ట్రోక్ సంబంధించిన కేసులను మూడు గంటల్లో హాస్పిటల్‌కు చేర్చగలిగినట్లయితే మెరుగైన ఫలితాలు అందించవచ్చని అన్నారు. టైం టూ బ్రెయిన్ అనే సూత్రాన్ని పాటిస్తే ప్రాణాలను కాపాడవచ్చు నన్నారు. ఐసియు వైద్యులు డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ జనరల్ ఫిజిషియన్ డాక్టర్ వివేక్ మాట్లాడుతూ వేసవి వ్యాధులు తీసుకోవాలసిన జాగ్రత్తలు గురించి వివరించారు సదస్సులో ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం జోనల్ అధ్యక్ష కార్యదర్శులు జంగం జోషీ, సుగుణేశ్వరీ ఫౌండేషన్ గౌరవ సలహాదారుల డాక్టర్ ఎన్ ఎల్ రావు, మమ్ముల తిరుపతి రావు, జిల్లా అధ్యక్షులు చిరంజీవి, పలువురు గ్రామీణ వైద్యుల పాల్గొన్నారు

వృద్ధులు, వికలాంగులకు హోం ఓటింగ్ సదుపాయం

జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో అవసరమైన వారందరికీ హోం ఓటింగ్‌కు అవకాశాన్ని కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్‌లో భాగంగా హోం ఓటింగ్ విధానంపై ప్రిసైడింగ్ అధికారులకు కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం శిక్షణ నిర్వహించారు. హోం ఓటింగ్‌కు అర్హత, దరఖాస్తు చేసే విధానం, దరఖాస్తుల స్వీకరణ, ఓటింగ్ చేయించడం, నియమ నిబంధనలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, వీడియోల ద్వారా వివరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, 85 ఏళ్ల పైబడిన వృద్ధులకు, 40 శాతం కంటే ఎక్కువ వికలాంగత్వం ఉన్న విభిన్న ప్రతిభావంతులకు ఈ సారి కొత్తగా ఇంటివద్దనుంచే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియలో భాగంగా కల్పించిన ఈ అవకాశాన్ని అర్హత ఉన్నవారు వినియోగించుకొనేలా చూడాలన్నారు. దీనికోసం ఈనెల 22వ తేదీ లోగా ఫారమ్ 12(డి) ద్వారా దరఖాస్తు చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో సుమారు 7181 మంది 80 ఏళ్ల పైబడిన వృద్ధులు, 40 శాతం కంటే ఎక్కువ వికలాంగత్వం ఉన్న 21,993 మంది ఉన్నారని తెలిపారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హత ఉన్నవారితో ఈనెల 26వ తేదీ నాటికి తుది హోం ఓటింగ్ జాబితాను తయారు చేస్తారని చెప్పారు.

హెూమ్ ఓటింగ్ సదుపాయాన్ని వినియోగించుకోవాలనుకొనే వారికి మే 7,8 తేదీల్లో ఉదయం 8 గంటలు నుంచి సాయంత్రం 5 గంటలు మధ్య అవకాశాన్ని కల్పించాలని యోచిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు, వీడియో గ్రాఫర్, మైక్రో అబ్జర్వర్‌తోపాటు బిఎల్‌ఒలు, పార్టీల ఏజెంట్లు కూడా దరఖాస్తు దారుని ఇంటికి వెళ్లి, ఓటు తీసుకుంటారని తెలిపారు. దీనికోసం పాటించాల్సిన నిబంధనలను, ప్రక్రియను వివరించారు. బ్యాలెట్ పత్రాల ద్వారా జరిగే ఈ విధానంలో కూడా, దరఖాస్తు దారుని ఇంట్లో ప్రత్యేకంగా కంపార్ట్మెంట్ ఏర్పాటు చేసి, ఏకాంతంగా ఓటు వేసేందుకు అవకాశం కల్పించాలని ఆదేశించారు. అవసరమైన పక్షంలో కుటుంబ సభ్యులను మాత్రమే వారికి సహకారం అందించేందుకు అనుమతించాలని సూచించారు. ఈ మొత్తం ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేయించాలని ఆదేశించారు. హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసిన వారికి, పోలింగ్ బూత్లో ఓటు వేసే అవకాశం ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు సందీప్‌కుమార్, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి సుధారాణి, ఎన్నికల సూపరింటిండెంట్ ప్రభాకర్, పిఒలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

క్వారీల్లో బాంబుల పేలుళ్లతో

ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం

యజమానులను నిలదీసిన గ్రామస్తులు

ప్రజాశక్తి-భోగాపురం

క్వారీల్లో నిర్వహించే పేలుళ్లతో ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని ముంజేరు పంచాయతీ గాబువానిపేట, మెట్ట సబ్బన్న పేట గ్రామస్తులు క్వారీ యజమానులను నిలదీశారు . పనులతో పాటు పేలుళ్ల నిలిపివేయాలని క్వారీ యజమానులకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. అనిల్ అనే వ్యక్తికి ఈ రెండు గ్రామాలకు సమీపంలో రెండు క్వారీలు ఉన్నాయి. ఇందులో నర్సింగరావు క్వారీ మూతబడి ఉండేది. ఈమధ్య ఈ క్వారీని ఎల్ అండ్ టి సంస్థకు లీజుకు ఇవ్వడంతో వారు ప్రస్తుతం పనులు ప్రారంభించారని గ్రామస్తులు చెబుతున్నారు. అనిల్ క్వారీలో గతంలో రామచంద్ర పేట వద్ద ఉన్న క్వారీని నిలిపివేయడంతో ప్రస్తుత ఈ గ్రామం వద్ద ఉన్న క్వారీలో పనులు ప్రారంభించారు. ఈ రెండు క్వారీలు మా గ్రామాలకు సమీపంలో ఉండడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. అనిల్ క్వారీలో బాంబులు అమర్చి ఉండడంతో పేలుళ్లు నిర్వహించవద్దని గ్రామస్తులు అడ్డుకున్నారు. కానీ ఇప్పటికే అమర్చి ఉన్నామని, ఎండల వేడికి పేలు పోయే అవకాశం ఉండడంతో ఈరోజు నిర్వహించి రేపట్నుంచి నిలిపివేస్తామని అన్నారు. ఎల్అండ్‌టి సంస్థ కూడా బాంబు పేలుళ్లు నిలిపివేస్తామని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. కానీ క్వారీల వలన అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని ఈ రెండు గ్రామాల ప్రజలు అంటున్నారు. పేలుళ్ల వల్ల వచ్చే శబ్దాలకు చిన్నపిల్లలు, వృద్ధులు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. ఇళ్లల్లో బీటలు వచ్చి ప్రమాదకరంగా మారుతున్నాయని అన్నారు.

క్వారీ యజమానిని నిలదీస్తున్న గ్రామస్తులు

మాటిచ్చినట్లే తోటపల్లి నీరు తెచ్చాను

రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-చీపురుపల్లి

2004 ఎన్నికల ముందు మాటిచ్చిన ప్రకారం తోటపల్లి ప్రాజెక్టు ద్వారా సాగు నీరందించానని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి, చీపురుపల్లి వైసిపి అభ్యర్థి బొత్స సత్యనారాయణ అన్నారు. మండలంలోని పర్ల, నిమ్మలవలసలో మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు నాయుడులా మోసం చేయకుండా ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలు మాఫీ చేసామన్నారు. ఈ ఐదేళ్లలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హయాంలో ప్రతీ గ్రామానికి రైతు భరోసా కేంద్రాలు ద్వారా విత్తనాలు, ఎరువులు అందజేయడంతో పాటు పండిన పంటను గ్రామంలోనే కొనుగోలు ప్రభుత్వమే కొనుగోలు చేసిందన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఓట్లు తక్కువ వచ్చాయా లేక ఎక్కువ వచ్చాయా అనేది ముఖ్యం కాదని,. పేదల ఆకలితో రాజకీయాలు ఉండ కూడదనే ఆలోచనతో అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకంగా ఎటువంటి దళారీ తనం లేకుండా ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల ద్వారా తెలుగుదేశం నాయకులు దోపిడి చేసేవారని, సాగు నీరు, తాగు నీరు, ప్రతీ గ్రామానికి గుడి బడి వైసిపి ప్రభుత్వమే తీసుకొచ్చిందన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని అనుకుంటే, మచి పనులు చేసామంటేనే ఓటు వేయండని బొత్స అన్నారు. గ్రామాని ఏంకావాలన్నా ఆ పని నేను చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపి బెల్లాన చంద్రశేఖర్, జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, బొత్స సందీప్ నాయుడు, ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రచార సభలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

శ్రీరామనవమి శుభాకాంక్షలు
(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - దేవాదాయ ధర్మాదాయ శాఖ)
శ్రీ రామస్వామి వారి దేవస్థానం
రామతీర్థం గ్రామం,
నెల్లిమర్ల మండలం, విజయనగరం జిల్లా

శ్రీరామస్వామి వారి దేవాలయంలో శ్రీరామనవమి కళ్యాణోత్సవం తేదీ 17-04-2024 (బుధవారం) దేవస్థానం గ్రౌండ్స్‌నందు వైఖానన అగమోత్తముగా జరుపబడును.

ఈ దిగువ తెల్పిన రుసుములు ఆన్‌లైన్ ద్వారా చెల్లించి శ్రీ స్వామి వారి సేవలను పొందవలెను.
శ్రీ స్వామి వారి నిత్య కళ్యాణం రూ॥ 1,500/-, అష్టోత్తర శతనామార్చన రూ॥ 100/-
ధన్వంతరి హోమం రూ॥ 516/-, సుదర్శన హోమం రూ॥ 516/-,
శ్రీమాద్రామాయణ పారాయణ రూ॥ 5,116/- , శ్రీ సుందరకాండ పారాయణ రూ॥1,500/-

శ్రీస్వామి వారి ఇ-హుండి, మొక్కుబడులు మరియు కానుకలు, పై అర్జిత సేవలు నిమిత్తం aptemples.ap.gov.in వెబ్ సైట్ ద్వారా లాగిన్ అయి భక్తులు వారి యొక్క మొక్కుబడులు మరియు కానుకలు గిట్ ద్వారా పేమెంట్ చేసి శ్రీస్వామి వారికి చెల్లించవలెను.

ఈ సేవలు నిమిత్తం HDFC BANK VIZIANAGARAM SRI RAMA SWAMY VARI DEVASTHANAM, ONLINE A/C NO: 50100429499489, IFSC CODE : HDFC0000744, మరియు శ్రీస్వామి వారి నిత్య వారి అన్నదాన పథకములో కనీస విరాళముగా రూ.1,116/-లు ఈ దిగువ తెల్సిన ఖాతాకు HDFC BANK VIZIANAGARAM SRI RAMA SWAMY VARI DEVASTHANAM, ONLINE A/C NO: 50200060003137, IFSC CODE :HDFC0009610, ద్వారా చెల్లించి మీ యొక్క గోత్రనామములు పూర్తి వివరములు 9491000711 నెంబరుకు వాట్సప్ లేదా మేసేజ్ పంపవలసినదిగా కోరుచున్నాము.

శ్రీ పి. అశోకగజపతిరాజు
వ్యవస్థాపక ధర్మకర్త

వై.శ్రీనివాసరావు
సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి